Government of Karnataka

# తెలుగు మంజరి

## ప్రథమభాష - తెలుగు

## Telugu First Language

# 8

## ఎనిమిదవ తరగతి

## Eighth Standard

భాగం - 2

పరిష్కృత ప్రతి

**(Revised)**

©KTBS NOT TO BE REPUBLISHED

**KARNATAKA TEXT BOOK SOCIETY (R.)**
6th Cross, Malleshwaram
Bangalore - 560 003.

# విషయ సూచిక


| క్రమసంఖ్య | పద్యభాగం | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 6. | నీతి పద్యాలు | - ఏనుగు లక్ష్మణ కవి, మారద వెంకయ్య, వేమన, బద్దెన | 1 |
| 7. | ముక్తి | - ధూర్జటి | 8 |
| 8. | దాతృత్వం | - పోతన | 14 |
| 9. | ద్రౌపది వేదన | - తిక్కనసోమయాజి | 21 |

| క్రమసంఖ్య | గద్యభాగం | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 6. | 'భారతరత్న' మోక్షగుండం విశ్వేశ్వరయ్య | - జానమద్ది హనుమచ్ఛాస్త్రి | 26 |
| 7. | ఉగాది పండుగ | | 34 |
| 8. | తుంగభద్రానది | | 38 |
| 9. | కిత్తూరురాణి చెన్నమ్మ | | 47 |
| 10. | పిల్లి- గ్రద్ద | - చిన్నయసూరి | 54 |
| | అనుబంధం | | 59 |
| | తెలుగు వ్యాకరణం | | 59 |
| | ఛందస్సు | | 65 |


@KTBS
NOT TO BE REPUBLISHED

# ౬. నీతి పద్యాలు

X8T4V7

[ఈ పాఠంలో మొదటి రెండు పద్యాలు ఏనుగు లక్ష్మణ కవి రచించిన 'సుభాషిత రత్నావళి' లోనివి. మూడు నాలుగు పద్యాలు మారద వెంకయ్య రచించిన 'భాస్కర శతకం'లోనివి. అయిదు, ఆరు పద్యాలు వేమన రచించిన పద్యాలు. ఏడు, ఎనిమిది పద్యాలు బద్దెన రచించిన 'సుమతి శతకం'లోనివి. శతకం అంటే నూరు పద్యాల కావ్యం.

1. ఏనుగు లక్ష్మణ కవి: 18వ శతాబ్దానికి చెందిన ఈయన పెద్దాపురం సంస్థానంలో ఆస్థాన కవిగా ఉండేవారు. భర్తృహరి రచించిన 'సుభాషిత త్రిశతి' ని 'సుభాషిత రత్నావళి' అనే పేరుతో ఈయన తెనిగించాడు. ఈయన రచన మూలాన్ని అనుసరించి సరళంగా, రసవంతంగా ఉంటుంది. విశ్వామిత్ర చరిత్రం, రామ విలాస ప్రబంధము, గంగా మహాత్మ్యము, రామేశ్వర మహాత్మ్యము, నృసింహ దండకము, ఆంధ్రనామ సంగ్రహము మొదలైనవి ఇతని ఇతర కృతులు.

2. మారద వెంకయ్య: ఈయన 16వ శతాబ్దానికి చెందిన కవి. భాస్కర శతక కర్త. ఈయన అనారోగ్యానికి గురికావటం వలన ఆరోగ్య ప్రదాత అయిన సూర్యుణ్ణి ఆరాధిస్తూ ఈ శతకాన్ని రచించాడు. నీతి శతకాలలో భాస్కర శతకం ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది.

ఇందులోని ప్రతి పద్యంలోను ఒక నీతి, దానికి తగిన దృష్టాంతం ఉండటం వల్ల నీతి బోధ పాఠకుల హృదయాలకు స్పష్టంగా హత్తుకు పోతుంది. ఈయన కవిత్వం నీతిబోధకమై, సరళంగాను, సహృదయ రంజకంగాను ఉంటుంది.

3. వేమన: 'ప్రజాకవి' అయిన వేమన 14వ శతాబ్దానికి చెందిన వాడు. మహాకవి, యోగి పుంగవుడు అయిన వేమన రెడ్డి కులస్థుడు. ఈయన సమాజంలోని దురాచారాలను, అవగుణాలను దాపరికం లేకుండా చిన్న చిన్న ఆటవెలది పద్యాల్లో నిశితంగా విమర్శించి, ప్రజలకు కనువిప్పు కలగించాడు, ఈయన వ్యావహారిక భాషలో 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో పద్య రచన చేశాడు. ఈయన కవిత్వం సరళంగాను, మృదు మధురంగాను ఉంటుంది.

4. బద్దెన: సుమతి శతక కర్త బద్దెన. ఈయన రాజ్యాధినేతగానే గాక సుప్రసిద్ధ కవిగా కూడా ప్రసిద్ధి చెందాడు. జన జీవనంలోని మేలు, కీళ్ళను పరిశీలించి జన సామాన్యానికి చాల దగ్గరగా ఉన్న నీతుల్ని ఉపయోగించి కందపద్యాల్లో సుమతి శతకాన్ని రాశాడు. ఈ శతకం ఒక నీతులపుట్ట అని చెప్పవచ్చు. ఈ పద్యాలు లోకంలోని మానవుల ప్రవర్తనలను, జీవన నీతులను బోధిస్తాయి. మానవ జీవితానికి ఈ పద్యాలు దారి దీపాలు.]

©KTBS NOT TO BE REPUBLISHED

1. ఉ. హర్తకు గాదు గోచర, మహర్నిశమున్ సుఖపుష్టిజేయు, స
త్కీర్తిఘటించు, విద్యయను దివ్యధనంబఖిలార్థి కోటికిం
బూర్తిగ నిచ్చినన్ బెరుగు, బోదు యుగాంతపు వేళనైన, భూ
భర్తలు తద్ధనాధికుల పట్టున గర్వము మానుటొప్పగున్.

2. శా. ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై
ఆరంభించిఁ బరిత్యజింతురు విఘ్నాయత్తులై మధ్యముల్,
ధీరుల్ విఘ్న నిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్.

3. చం. తెలియని కార్యమెల్లఁ గడతేర్చుట కొక్క వివేకి చేకొనన్
వలయునటైనదిద్దు కొనవచ్చు ప్రయోజనమాంద్యమేమియుం
గలుగదు, ఫాలమందు దిలకంబిడునప్పుడు చేతనద్దముం
గలిగిన చక్కజేసికొనుగాదె నరుండది చూచి భాస్కరా !

4. చం. పలుమఱు సజ్జనుండు ప్రియభాషలె పల్కు, కఠోర వాక్యముల్
పలుకడొకానొకప్పు, డవి పల్కిన కీడును కాదు, నిక్కమే
చలువకు వచ్చి మేఘుడొక జాడను తా వడగండ్ల రాల్చినన్
శిలలగు నోటు వేగిరమె శీతల నీరము గాక ? భాస్కరా !

5. ఆ.వె. ధనము కూడ బెట్టి ధర్మంబు సేయక
తాను తినక లెస్స దాచుగాక
తేనటీగ గూర్చి తెరువరి కియ్యదా ?
విశ్వదాభిరామ వినురవేమ !

6. ఆ.వె. నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల ?
చదువ పద్యమరయ చాలదా ఒక్కటి ?
విశ్వదాభిరామ వినురవేమ !

7. కం. ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ !

8. కం. కూరిమిగల దినములలో
నేరము లెన్నడును గలుగ నేరవు, మరియా
కూరిమి విరసంబైనను
నేరములే దోచుచుండు నిక్కము సుమతీ !

## కొత్తపదాలు

అన్యులు, అహర్నిశము, ఉజ్జగింపు, కఠోరవాక్యం, కూరిమి, తళుకు బెళుకు, తెరువరి, దివ్యధనంబు, ధన్యుడు, ధీరులు, ధృత్యున్నతోత్సాహాలు, నరుడు, నిక్కము, నీలము, పరిత్యజించు, ప్రియభాషలు, ప్రజ్ఞానిధి, ఫాలము, మనము, భూభర్తలు, మాంద్యం, యుగాంతం, వడగండ్లు, విఘ్నాయత్తులు, విఘ్నాయాస, విరసం, వివేకి, శీతల నీరము, సజ్జనుడు, సత్కీర్తి, సంత్రస్తులు, హర్త.

## పద్యాలకు అర్థాలు

1. హర్తకు=దొంగకు; గోచరముగాదు=కనిపించదు; అహర్నిశమున్=రేయింబవళ్ళు; సుఖపుష్టి=నిండుసుఖాన్ని; చేయున్=కలిగిస్తుంది. అఖిల+అర్థి+కోటకిన్=విద్యను కోరే జనులందరికి; దివ్యధనంబు=దివ్యమైన ధనం; సత్+కీర్తి=గొప్ప కీర్తిని; ఘటించున్=కలిగిస్తుంది; పూర్తిగన్=తనకున్న విద్యనంతా; ఇచ్చినన్=దానము చేసినా; (ఇంకా) పెరుగున్=వృద్ధి చెందుతుంది; యుగ+అంతము+వేళ+అయినన్=ప్రళయ కాల సమయంలోనైన; పోదు=నశించదు (కావున); భూభర్తలు=మహారాజులు; తత్+ధన+అధికుల=విద్య అనే ధనాధిపతుల; పట్టున=దగ్గర; గర్వము=తమయొక్క గర్వాన్ని; మానుట=చూపించకుండుట; ఒప్పు+అగున్=మంచిది.

2. ఆరంభిపరు=మొదలుపెట్టరు; విఘ్నాయాస సంత్రస్తులు=ఆటంకాల శ్రమ వల్ల భయపడేవారు; పరిత్యజింతురు=వదలి పెడతారు; ఉరువిఘ్నాయత్తులై=గొప్ప విఘ్నాలకుఅధీనులై, విఘ్న నిహన్యమానులు=ఆటంకాలచే హతులైన వారు; ధృతి+ఉన్నత+ఉత్సాహులు=ధైర్యంతో గూడిన గొప్ప ప్రయత్నం గలవారు; ఉజ్జగింపరు=వదలరు; ప్రజ్ఞానిధుల్=తెలివిగలవారు, ధీరులు



@KTBS NOT TO BE REPUBLISHED

3. కార్యము=పని; కడతేర్చుట=పూర్తిచేయుట; వివేకి=తెలివి గలవాడు; మాంద్యము=మందగించటం; ఫాలము=నొసలు; నరుడు=మానవుడు; భాస్కరా=సూర్యదేవా.

4. భాస్కరా=ఓ భాస్కరుడా; సజ్జనుడు=ఉత్తముడు; ప్రియ భాషలు=ప్రియమైన మాటలు; పల్కు=మాట్లాడుతాడు; కఠోర వాక్యముల్=కఠినమైన మాటలు; పలకడు=మాట్లాడడు; ఒకానొకప్పుడు=ఎప్పుడోఒకసారి; అవి=ఆ కఠినమైన మాటలు;

పల్కిన=మాట్లాడినా; కీడును కాదు=హాని కలిగించదు; నిక్కమే=నిజమే కదా ! చలువకు వచ్చి=చల్లదనంకోసం వచ్చి; ఒక జాడను=ఎక్కడైనా ఒకచోట; మేఘుడు=మేఘం; వడగండ్ల రాల్చినన్=వడగళ్ళను పడవేసినా; శీతల నీరముగాక=చల్లని నీరుగాకాక; శిలలగు నోటు=రాళ్ళు అవుతాయా ?

5. ధర్మం=దానం; లెస్స=బాగుగా; తెరువరి=బాటసారి; విశ్వద+అభిరామ=విశ్వానికి ఇష్టమైన వాడా ! వినురః=వినుమా ! వేమ=వేమనా !

6. నిక్కము=సత్యం; నీలము=ఒక నీలి రంగు మణి; తళుకు బెళుకు రాళ్ళు=తళతళ మెరిసే చౌక రకం రాళ్ళు; తట్టెడు=అనేకం; అరయు=విచారించు;

7. ఎప్పటి=ఏ సమయం; అన్యులు=ఇతరులు; మనముల్=మనస్సులను; నొప్పింపక =బాధపెట్టక; ధన్యుడు=కృతార్థుడు;

8. కూరిమి=ప్రేమ, స్నేహం; నేరము=తప్పు; విరసం=రసంలేనిది; విరిగినది; నిక్కము=నిజం;

©KTBS NOT TO BE REPUBLISHED

**సారాంశం** :

1. విద్య దొంగకు కనిపించదు. రాత్రింబవళ్ళు సుఖ సంతోషాలనిస్తుంది. విద్యార్థులకు గొప్ప కీర్తిని కలిగిస్తుంది. ఆ విద్యను దానం చేసినా పెరుగుతుంది కాని తరుగదు. ప్రళయకాల సమయంలో కూడా నశించదు. కాబట్టి మహారాజులైన వారు కూడా విద్యాధికుల దగ్గర తమ గర్వాన్ని ప్రదర్శించకుండా ఉండడం మంచిది.
2. ఆటంకాలకు, శ్రమకు భయపడి నీచులు ఏ కార్యాన్నీ మొదలు పెట్టరు. కార్యాన్ని మొదలు పెట్టి విఘ్నాలు కలిగితే వదలి పెట్టేవారు మధ్యములు. ధీరులు, తెలవిగలవారు ఎన్ని విఘ్నాలు కలిగినా ధైర్యంతో గొప్ప ప్రయత్నం చేసి, మొదలు పెట్టిన దానిని వదలక పూర్తి చేస్తారు.
3. భాస్కరా ! తెలియని పనిని నెర వేర్చుకొనటానికి ఒక బుద్ధిమంతుని ఆశ్రయిస్తేచాలు. పని నెరవేరుతుంది. దీని వలన ఆలస్యం కాదు. నొసట తిలకం పెట్టుకోవటానికి అద్దముంటే చాలుగదా !

4. ఉత్తముడు ఎల్లప్పుడు మంచి మాటలు మాట్లాడుతాడు. పౌరుషంగా మాట్లాడడు. ఎప్పుడైనా పౌరుషంగా మాట్లాడినా అది హానికరం కాదు. ఎలా అంటే చల్లదనం కోసం వచ్చి మేఘుడు వడగళ్ళు రాల్చినా అవి చల్లటి నీరుగా మారుతాయేగాని రాళ్ళ వుతాయా ?

5. ఓ వేమా ! లోభి తాను పోగు జేసి దానం చెయ్యకుండా, తాననుభవించకుండా దాచిన ధనం పరులపాలు కాక తప్పదు. తేనటీగ తాను తాగక పోగుచేసి దాచిన తేనె బాటసారుల పాలవుతున్నది గదా !

6. ఓ వేమా ! వినుము. తళుకు బెళుకులుగల రాళ్ళు అనేకం కలిగి ఉండటం కంటే విలువైన నీలమణిని కలిగి ఉండటం మంచిది. ఎన్నో చదువులు చదవడం కంటే రస భావం ఉన్న ఒక పద్యం చదివినా చాలు.

7. సుమతీ ! ఏ సమయానికి ఏది తగినదో అప్పటికి ఆ మాటలను పల్కి ఇతరుల మనస్సులను భాధింపకుండా తాను బాధ పడకుండా తప్పించుకొని నడుచుకొను వాడే కృతార్థుడు.

8. సుమతీ ! ప్రేమ, మైత్రి ఉన్న సమయంలో వారి మధ్య తప్పులు కనబడవు. ఆ ప్రేమ, మైత్రి చెడిపోతే ఒప్పులే తప్పులుగా కనిపిస్తాయి. ఇది ప్రపంచంలో సత్యమైన మాట. మానవ సహజగుణం కూడా.

## నానార్థాలు

కీర్తి=యశస్సు, బురద, అనుగ్రహం; నరుడు=మానవుడు; శీతల=చల్లన, చందనం, కప్పురం; ధనము=విత్తం, గో సమూహం; కోటి= సమూహం, నూరు లక్షలు; యుగం=జంట, కాల ప్రమాణం; అర్థం=ధనం, మాటకర్థం, అవగాహన.

## పర్యాయ పదాలు

| | | |
|---|---|---|
| కీర్తి | – | పేరు, యశస్సు, ఖ్యాతి |
| ధనం | – | ద్రవ్యం, విత్తం, అర్థం, డబ్బు, సొమ్ము |
| గర్వం | – | అభిమానం, అహంకారం |
| జలం | – | నీరు, సలిలము, |
| మేఘం | – | జలధరం, మొయిలు, తోయదం |

© KTBS NOT TO BE REPUBLISHED

## ప్రకృతి వికృతులు

| ప్రకృతి | | వికృతి |
|---|---|---|
| కీర్తి | – | కీరుతి |
| కార్యము | – | కర్జము |
| విద్య | – | విద్దె, విద్దియ |
| ధర్మం | – | దమ్మం |

## వ్యతిరేక పదాలు

| | | |
|---|---|---|
| ప్రయోజనం | × | నిష్ప్రయోజనం |
| కీర్తి | × | అపకీర్తి |
| విద్య | × | అవిద్య |
| ధర్మము | × | అధర్మము |
| ప్రస్తుతము | × | అప్రస్తుతము |
| సుమతి | × | కుమతి |
| సరసం | × | విరసం |

@KTBS NOT TO BE REPUBLISHED

## సంధులు

| | | | | | |
|---|---|---|---|---|---|
| అఖిల | + | అర్ధకోటి | = | అఖిలార్ధ కోటి | (సవర్ణదీర్ఘ సంధి) |
| ధన | + | అధికులు | = | ధనాధికులు | (సవర్ణదీర్ఘ సంధి) |
| శిలలు | + | అగు | = | శిలలగు | (ఉకార సంధి) |
| తట్టెడు | + | ఏల | = | తట్టెడేల | (ఉకార సంధి) |
| మానుట | + | ఒప్పు | = | మానుటొప్పు | (అకార సంధి) |
| సత్ | + | జనుండు | = | సజ్జనుండు | (శ్చుత్వ సంధి) |

**సమాసాలు**

| | | | |
|---|---|---|---|
| దివ్యధనం | = | దివ్యమైన ధనం | (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం) |
| శీతల నీరం | = | శీతలమైన నీరం | (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం) |
| మంచి నీలము | = | మంచిదైన నీలము | (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం) |
| సత్కీర్తి | = | మంచిదైన కీర్తి | (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం) |
| ధనాధికులు | = | ధనము చేత అధికులు | (తృతీయా తత్పురుష సమాసం) |
| యుగాంతము | = | యుగము యొక్క అంతము | (షష్ఠీ తత్పురుష సమాసం) |

**కింది ప్రశ్నలకు ఒకటి, రెండు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. శతకం అని దేన్ని అంటారు ?
2. 'సుభాషిత త్రిశతిని' ఎవరు రచించారు ?
3. 'సుభాషిత రత్నావళిని' తెనిగించిన దెవరు ?
4. 'భాస్కర శతకాన్ని' రచించినదెవరు ?
5. బద్దెన రచించిన శతకం ఏది ?
6. 'ప్రజాకవి' అని ఎవరిని అంటారు ?

**కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. విద్యయొక్క గొప్పతనాన్ని వివరించండి ?
2. సజ్జనుడి స్వభావం ఎటువంటిది ?
3. కూరిమి ఉన్నప్పటికీ, లేనప్పటికీ గల భేదమేమి ?
4. నీచులు, మధ్యములు, ధీరులు వీరికి గల తేడా ఏమిటి ?

NOT TO BE REPUBLISHED @KTBS

# 7. ముక్తి

ధూర్జటి -

[క్రీ.శ. 1509-29 మధ్య విజయనగరాన్ని పరిపాలించిన శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానకవి ధూర్జటి. అష్టదిగ్గజకవులలో ఇతడొకడు. ఈ కవి శివభక్తుడు. ఇతని రచన శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం. ఇతనిదే మరొక ప్రసిద్ధరచన, 'శ్రీ కాళహస్తీశ్వర శతకం'.

ప్రస్తుత పాఠ్యభాగం శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యం నుంచి గ్రహించడం జరిగింది. శ్రీ కాళహస్తి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోఉన్న ఒక పుణ్యక్షేత్రం. శ్రీ అంటే సాలెపురుగు. కాళ అంటే పాము. హస్తి అంటే ఏనుగు. ఈ మూడూ ముక్తి పొందిన స్థలం కాబట్టి ఇది శ్రీ కాళహస్తి అయింది.

ప్రబంధ యుగంలోని పద్యాలను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం]



© KTBS Not to be republished

1. కృతయుగ వేళ మర్కటక కీటక మొక్కటి పూర్వవాసనా
గతమతి దేవదేవు, గరకంధరు గొల్వదలంచి కుంభజ
క్షితిధర కన్యకాంబు పరిషిక్త శరీరముతోడనాత్మని
ర్గత బహుతంతుపంక్తిగృహ కల్పన శిల్పకళా ప్రవీణతన్.

2. ప్రాకారములు, గోపురమ్ములు, కొలువు కూ
టములు నర్తన మందిరములు, కోశ
గేహము, ల్పందిళ్ళు, కేళీ నివాసమ్ము
లంతః ప్రదక్షిణాయతన వీధి
యుపహార భోగమంటపము గర్భగృహంబు
పరిణయహేతు వైభవ నిశాంత
మంతఃపురంబు, కక్ష్యాంతరంబులు, బాల
కంబులు మేడలు గరుణతోడ
నిభముఖానల జాత చండీశపుండ
రీకలోచన మాతృకాలోక నయన
దక్షిణామూర్తి వటుకాది దైవతముల
నిలయములు గట్టె నత్యంత నిష్ఠతోడ.

3. తీరుగ నీగతి నిండులు
తీరుగ గట్టియును, గాలి ద్రెవ్విన పోగుల్
జారినపోగులు నదుకం
దీరుపనే కాని నిలువదీరక దినమున్

4. సేవింపంగ జెలంది నేమము పరీక్షింపన్ లలాటాక్షుడా
త్మావాసంబుననున్న దీపశిఖి కీలాభీలతీవ్ర ప్రభా
వ్యాలిఢ్ధాంబరమై తగుల్కొని తదీయాగారముల్ ధూమమై
పోవం జేసిన లేచి కీటకము నుద్భూత వ్యథా క్రోధమై.

5. ఇది పెక్కేడులు బట్టెన్
సదనంబులు గట్ట నాకు శంభుని కొరకున్
దుదిగుమ్మరి కొకయేడును
గుదె కొక పెట్టన్న మాటకున్ సరివచ్చెన్.

©KTBS NOT TO BE REPUBLISHED

6. కటకట నే ప్రయాసమున గట్టినయిండ్లను గాల్చెదీపమిం
తట బడి దీని మ్రింగక వృథావసియించిన గోపమారునే ?
యటమట మైన జీవనము నందలి మోహముచాలు నంచును
త్కటగతి దీపికానల శిఖావిసరంబులు ద్రావబోవగన్.

7. ✦ దేవోత్తంసుడు, భక్తవత్సలుడు చిత్తేశ స్వభావుండు గౌ
రీవామాంగుడు, శంకరుండు దయమీరిన్ బోవ, గెంగేలునన్
జావన్వచ్చిన పుర్వు బట్టి, తగు నీ సద్భక్తికిన్ మెచ్చితిన్
నీవేయర్థము నన్ను వేడెదవు దానింజెప్పుమా" నావుడున్

8. చెలదియు, "నా తపమింతట
ఫలియించె" నటంచు బ్రమథపతికిబ్రణామం
బులు పెక్కు సేసి సంభ్రమ
కలిత హృదయమగుచు భక్తి గడలు కొనంగన్

9. నాకే భవ దుఃఖంబులు
లేక మహాజ్ఞానకర రసవిలీనుడనగుచున్
లోకం బెన్నడు నెరుగని
యాకైవల్యమే యభీష్టమని ప్రార్థింపన్.

10. ఎక్కడ జూచినన్ సుర మునీశ్వర దానవమానవాహిపుల్
మ్రొక్కుచు సన్నుతించు రవముల్ ధ్రువమండల వీథినిండగా
దిక్కులు ముంచుకొన్నతన తేజములోపల నూర్ణనాభమున్
గ్రక్కునగూర్చె తన్మయముగా శివలింగము భక్తిలోలతన్.

## కొత్తపదాలు.

మర్కటక కీటకము; కరకంధరుడు; కుంభజ క్షితిధర కన్యక; అంబువు; పరిషిక్త; ఆత్మనిర్గత; ప్రవీణత; ఇభముఖ; అనలజ; దైవతములు; నేమము; లలాటాక్షుడు; గుదె; ప్రయాసము; ప్రమథపతి; భవము; కైవల్యము; అభీష్టము; తేజము; ఊర్ణనాభము;

@KTBS NOT TO BE REPUBLISHED

**కఠిన పదాలకు అర్థాలు.**

1. మర్కటక కీటకము=సాలెపురుగు; కరకంధరుడు=శివుడు; కుంభజక్షితి ధరకన్యక=స్వర్ణముఖీ నది; అంబువు=నీళ్ళు; పరిషిక్త=స్నానం చేసి; ఆత్మనిర్గత=తన నుంచి వెలికి తీసిన; బహు=అనేక; తంతు=తీగలు; పంక్తి=వరుస; గృహకల్పన=ఇళ్ళు కట్టడం; ప్రవీణత=నేర్పరితనం.

2. నర్తన=నృత్య; ఇభముఖ=ఏనుగుముఖం కలిగినవాడు(గణపతి); అనలజ=అగ్నినుండి పుట్టినవాడు(సుబ్రహ్మణ్యుడు); దైవతములు=దేవతలు;

3. త్రెవ్విన=తెగిన;

4. నేమము=నియమము; లలాట+అక్షుడు=నొసటిపై కన్నుగలవాడు (శివుడు); కీల=జ్వాల; ఆగారముల్=నిర్మాణాలు.

5. గుదె=కర్ర;

6. ప్రయాసము=శ్రమ; అటమటము=ప్రయాస; దీపికా+అనల=దీపజ్వాల;

7. గౌరీవామ+అంకుడు=పార్వతీదేవిని శరీరంలో దాల్చినవాడు; కెంగేలు=చేతులు.

8. ప్రమథపతి=శివుడు;

9. భవ=సంసారానికి సంబంధించిన; కైవల్యము=ముక్తి; అభీష్టము=కోరిక;

10. తేజము=కాంతి; ఊర్ణనాభము=బొడ్డులో తంతువులు గలది=(సాలెపురుగు)

**సారాంశం** :

1. కృతయుగంలో ఒక సాలెపురుగుండేది. పూర్వవాసనవల్ల గొప్ప శివభక్తితో ఉండేది. అనేక విధాలైన సాలెగూళ్ళను నిర్మిస్తూ, కళాప్రావీణ్యంతో దేవుని మెప్పించేది.
2. ప్రాకారాలు, గోపురాలు, సభామంటపాలు, నృత్య మందిరాలు, పందిళ్ళు, అంతఃపురాలు, విహారమండపాలు, మేడలు మొదలైన నిర్మాణాలను గణపతికి, కుమార స్వామికి, చండీశునికి, దక్షిణామూర్తికి మొదలైన దేవుళ్ళకు సాలెపురుగు రకరకాల తంతు నిర్మాణాలు చేసేది.
3. ఇలా కట్టిన తంతువులు ఒకవేళ గాలికి తెగిపోతే, మరీ అతికించేది. ఇలాగ తీరిక లేకుండా దినమంతా గడుపుతూనే ఉండేది సాలెపురుగు.

@KTBS NOT TO BE REPUBLISHED

4. ఆ సేవలకు సంతోషపడ్డాడు, శివుడు. దాని నియమనిష్ఠలను పరీక్షించాలనుకున్నాడు. తన ఆలయంలో ఉన్న దీపశిఖ ఆ గూళ్ళకు తగుల్కునేలాగ చేశాడు. దానితో ఆ నిర్మాణాలన్నీ బూడిదైపోయాయి.

5. "శివుడికోసం ఇది నిర్మించడానికి నాకు ఎన్నో ఏళ్ళుపట్టింది. కుమ్మరి కష్టపడి ఒక సంవత్సరం పాటు శ్రమించి కుండలు చేస్తే పగలగొట్టడానికి ఒక్క దెబ్బ చాలు అని అన్నట్లుగా ఉంది".

6. అయ్యో, నేనెంతో శ్రమించి కట్టిన నిర్మాణాలను ఈ దీపం కాల్చేసింది. దీనిని మింగేస్తే తప్ప నా కోపం తీరదు. ఇంత ప్రయాసగా ఉండే ఈ జీవితం మీది ఆరాటం చాలు అని అంటూ ఆ సాలెపురుగు ఆ దీపాన్ని మింగ బోయింది.

7. అప్పుడు, భక్తులను ప్రేమతో చూసే శివుడు దయతో ప్రత్యక్షమయ్యాడు. మరణించబోయిన ఆ పురుగును చేతితో పట్టి ఆపాడు. నీ భక్తికి మెచ్చాను. 'నీకేం కావాలో కోరుకో' అన్నాడు .

8. అపుడా సాలెపురుగు "నా తపస్సు ఫలించింది" అని శివునికి ఎన్నో రకాలుగా నమస్కారాలు చేసింది. భక్తితో పులకించింది. ఇలా అంది.

9. "నాకు భవదుఃఖాలేవీ లేకుండా చేయి. జ్ఞానాన్ని ప్రసాదించు. లోకం అంటే తెలీని కైవల్యాన్ని ప్రసాదించు" అని ప్రార్థించింది.

10. అపుడు శివుడు ఆ సాలెపురుగును తనలో లీనం చేసుకున్నాడు. దేవతలు, మునీశ్వరులు, దానవులు, మానవులు, సర్పాలు మొక్కుతూ, శివస్తుతి చేస్తుండగా శివతేజస్సులోకి సాలెపురుగు లీనమయింది.

## వ్యాకరణాంశాలు :

### పర్యాయపదాలు:

| | | |
|---|---|---|
| 1. మర్కటక కీటకము | – | సాలెపురుగు, సాలీడు |
| 2. అభీష్టము | – | కోరిక, ఇష్టము |
| 3. మెచ్చు | – | అంగీకరించు, పొగడు |
| 4. కరకంధరుడు | – | శివుడు, శ్రీకంఠుడు |

### వ్యుత్పత్త్యర్థాలు :

| | | |
|---|---|---|
| 1. కరకంధరుడు | – | విషమును కంఠమునందు నిలిపినవాడు (శివుడు) |
| 2. లలాటాక్షుడు | – | నొసటియందు కన్నుగలవాడు (శివుడు) |
| 3. ఊర్ణనాభము | – | నాభియందు తంతువులుగలది (సాలెపురుగు) |

© KTBS NOT TO BE REPUBLISHED

**ప్రకృతి వికృతులు** :

నియమం ________ నేమం

శిఖ ________ సిగ

గృహం ________ గీము

వ్యథ ________ వెత

**సంధులు** :

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. కక్ష్య | + | అంతరము | = | కక్ష్యాంతరము | సవర్ణదీర్ఘసంధి |
| 2. లలాట | + | అక్షుడు | = | లలాటాక్షుడు | సవర్ణదీర్ఘసంధి |
| 3. ఆత్మ | + | ఆవాసం | = | ఆత్మావాసం | సవర్ణదీర్ఘసంధి |
| 4. తత్ | + | మయము | = | తన్మయము | అనునాసికసంధి |
| 5. ముని | + | ఈశ్వర | = | మునీశ్వర | సవర్ణదీర్ఘసంధి |

**సమాసాలు**:

1. లలాటాక్షుడు – లలాటమందు అక్షగలవాడు, బహువ్రీహి సమాసం
2. సద్భక్తి – మంచి భక్తి; విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
3. మునీశ్వరుడు – మునులలో ఉత్తముడు; షష్ఠీ తత్పురుష సమాసం

**ప్రశ్నలు**

**ఐదు పంక్తులలో సమాధానం రాయండి.**

1. సాలెపురుగు ఎలాంటి నిర్మాణాలు చేసింది ?
2. శివుడికి సాలెపురుగుకు మధ్యగల సంభాషణను చిత్రించండి ?

**పది పంక్తులలో సమాధానం తెల్పండి**

1. పాఠ్యసారాంశాన్ని తెల్పండి ?
2. సాలీడు భక్తిని వివరించండి ?

@KTBS NOT TO BE REPUBLISHED

# ౩. దాతృత్వం

F2X8S5

**పోతన -**

[బమ్మెరపోతన రచించిన శ్రీమదాంధ్ర మహాభాగవతం అష్టమ స్కంధంనుండి ఈ పాఠ్యభాగం తీసుకోబడింది. ఈయన 15వ శతాబ్దానికి చెందినవాడు. కవిత్వం తియ్యగా చెప్పగలిగినవాడు. అందుకే ఇతని కవిత్వం పండితులకేగాక, పామరజనులకుకూడా విందు భోజనం. మనకు తెలియకనే ఎన్నోపోతన పద్యాలను పాడుకొంటున్నాం. ఈయనకు 'సహజ పండితుడ'న్న బిరుదు ఉంది. భాగవత రచనకు ముందు వీరభద్ర విజయం, భోగినీ దండకం మొదలైన కావ్యాలను పోతన రచించాడు.

దానం శ్రేష్ఠగుణం. ఉన్న దాంట్లో యాచకులకు కొంత ఇవ్వడం కొందరి దాతల లక్షణం. మరి కొంతమంది తమకోసం ఏమీ మిగుల్చుకోకుండా దానం చేస్తారు. దానంవల్ల తమకు సర్వనాశనం కలుగుతుందని తెలిసీ కొందరు యాచకులకు లేదనలేరు. దాతల్లోని ఈ గుణాన్ని తెలుసుకొని, యాచకులు తమతమకోర్కెల్ని సిద్ధింపచేసుకుంటూ ఉంటారు.

బలిచక్రవర్తి రాక్షసరాజు, దేవతలకు విరోధి. శ్రీ మహావిష్ణువు అతనిని అణగద్రొక్కడం కోసం వామనావతారంలో అతను చేస్తున్నయాగ స్థలం దగ్గరికి వెళ్ళి, దానం అడిగే సందర్భం లోనిది ప్రస్తుత పాఠ్యభాగం]

1. వ. అయ్యజమానుండభ్యాగతునకిట్లనియె.

2. మ. వడుగా ! యెవ్వరివాడ ? వెవ్వడవు ? సంవాసస్థలం బెయ్యది
యెయ్యెడకున్ నీవరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మమున్;
గడు ధన్యాత్ముడనైతి; నీ మఖము యోగ్యంబయ్యె; నా కోరికల్
గడతేరన్; సుహుతంబులయ్యె శిఖులుం; గల్యాణ మిక్కాలమున్.

✦ 3. మ. వరచేలంబులో మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులో విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీ ఖండమొకాక యేమడిగెదో ధాత్రీ సురేంద్రోత్తమా !

4. వ. అని ధర్మయుక్తంబుగా బలికిన వైరోచనుని వచనంబులు విని
సంతోషించి యాశ్వరుండిట్లనియె

©KTBS NOT TO BE REPUBLISHED

5. సీ. ఇది నాకు నెలవని యేరీతి బలుకుదు ?
నొకచోటనక యెందునుండనేర్తు;
నెవ్వనివాడనంచేమని పలుకుదు ?
నాయంతవాడనై నడువనేర్తు
నీ నడవడియని యెట్లు వక్కాణింతు
బూని ముప్పోకల బోవనేర్తు
నదినేర్తు నిదినేర్తు ననియేల చెప్పంగ ?
నేరుపులన్నియు నేన నేర్తు

ఆ. నొరులుగారు నాకు నొరులకు నేనౌదు
నొంటివాడ జుట్ట మొఃకడులేఃడు
సిరియు దొల్లిగలదు చెప్పెద నా టెంకి
సుజనులందుదఱచు సొచ్చియుందు

6. ఆ. ఒంటివాడ నాకు నొకటి రెండడుగల
మేరయిమ్ము సొమ్ము మేరయొల్లఁ;
గోర్కిదీర బ్రహ్మకూకటి ముట్టెద
దానకుతుక సాంద్రదానవేంద్ర

7. వ. అనిన బరమ యాచకునకు బ్రదాతయిట్లనియె

8. మ. వసుధాఖండమువేడితో ? గజములన్ వాంఛించితో ? వాజులన్
వెసనూహించితొ ! కోరితో యువతులన్ వీక్షించికాంక్షించితో ?
పసి బాలుండవు నేరవీవడుగ; నీ భాగ్యంబులీపాటిగా
క సురేంద్రుండు పదత్రయంబడుగ నీయల్పంబు నీ నేర్చునే ?

9. వ. అన మొగంబునం జిరునగవు మొలకలొత్త గృహమేధికి
మేధావియిట్టనియె.

✦ 10. మ. గొడుగో, జన్నిదమో, కమండలువొ, నాకున్ ముంజియో దండమో,
వడుగేనెక్కడ ? భూములెక్కడ ? కరుల్, వామాక్షు, లశ్వంబులె
క్కడ ? నిత్యోచితకర్మమెక్కడ ? మదాకాంక్షామితంబైన మూ
డడుగల్మేరయ త్రోవకిచ్చుటది బ్రహ్మాండంబు నా పాలికిన్

11. శా. ఆశాపాశముదా గడున్ నిడుపు; లేదంతంబు రాజేంద్ర;వా
రాశి ప్రావృత మేదినీ వలయ సామ్రాజ్యంబు సేకూరియుం
గాసిం బొందిరిగాక వైన్యగయ భూకాంతాదులు; న్నర్థకా
మాశం బాయగ నేర్చిరే మును నిజాశాంతంబులం జూచిరే.

NOT TO BE REPUBLISHED @KTBS

12. సీ. సంతుష్టుఁడీమూఁడు జగములే బూజ్యుండు
సంతోషికెప్పుడు జరుగు సుఖము
సంతోషిగాకుంట సంసార హేతువు
సంతసంబున ముక్తి సతియు దొరకు
బూటపూటకు జగంబుల యదృచ్ఛాలాభ
తుష్టిని దేజంబు దోన పెరుగు
బరితోషహీనతఁ బ్రభసెడి పోవును
జలధార ననలంబు సమయునట్లు

ఆ. నీవు రాజువనుచు నిఖిలంబు నడుగుట
దగవు కాదు నాకుఁ; దగిన కొలది
యేను వేఁడి కొనిన యీపదత్రయమును
జాలదనకయిమ్ము; చాలుఁ జాలు



## కొత్తపదాలు

అశ్వం; కాంక్షించి; టెంకి; దానవేంద్ర; ధన్యాత్ముడు; ధరణీఖండం; నికేతనములు; నిఖిలము; నిత్యోచిత; పదత్రయం; ప్రదాత; పూజ్యుడు; బ్రహ్మకూకటి; భూకాంతాదులు; ముంజి; మూడడుగులు; ముప్పోకల; యాచకుడు; వక్కాణించు; వసుధాఖండం; వామాక్షు; వాంఛించి; వారాశి; విమృష్టాన్నం; శిఖులు; సంతుష్టుడు; సుహృతము.

## అర్థాలు

యజమానుడు=యజ్ఞంచేయించేవాడు; అభ్యాగతుడు=పిలువకనే భోజనం వేళకు వచ్చేవాడు; మఖము=యజ్ఞం; సుహృతంబు=చక్కగా ప్రేల్చబడింది; కూకటి=జుట్టు; కాంచనము=బంగారం; నికేతనం=భవనం; టెంకి =స్థానం; వాజి=గుర్రం; కాంక్ష=కోరిక; గృహమేధి=గృహస్థుడు; మేధావి=తెలివిగలవాడు; జన్నిదము–జందెం; అశ్వంబులు=గుర్రాలు; వైన్యుడు=వేనుని కొడుకు (ఒకరాజు) పృథు చక్రవర్తి; గాసి=శ్రమ; జగము=ప్రపంచం; అనలంబు=అగ్గి; కుతుకము=కుతూహలము; హరులు=గుర్రాలు; దానవేంద్రుడు=రాక్షసరాజు.

## సారాంశం :

1. బలి చక్రవర్తి వామనునితో ఇలా అన్నాడు
2. ఓ బ్రహ్మచారీ ! నీ పేరేమిటి ? ఎవరిపిల్లవాడవు ? నీవు నివసించే చోటేది ? ఇక్కడికి నీవు రావడం వల్ల నా వంశం, నా జన్మం సఫలమైంది. నేను చాలా పుణ్యాత్ముడైనాను. ఈ యజ్ఞం పవిత్రమైనది. నా కోరికలు నెరవేరినాయి. అగ్నులు బాగా ప్రేల్చబడినాయి. ఈ కాలం చాలా శుభదాయకమైనది.
3. ఓ బ్రాహ్మణోత్తమా ! నీకేమి కావాలి ? మేలైన వస్త్రాలా ? రూకలా ? పండ్లా ? అడవి సంపదలా ? ఆవులా ? గుఱ్ఱాలా ? రత్నాలా ? రథాలా ? మంచి ఆహారాలా ? కన్యలా ? ఏనుగులా ? బంగారమా ? భవనాలా ? గ్రామాలా ? పొలాలా ? భూభాగమా ? ఇవి కాకుండా ఇంకేమైనా కావాలా ?
4. ధర్మ ప్రకారంగా బలి చక్రవర్తి పలికిన పలుకులకు సంతోషించి వామనుడు ఇలా అన్నాడు.
5. ఇది నా చోటని ఎలా చెప్పేది. ఒక చోటనకుండా అన్ని చోట్లా ఉంటాను. ఎవరికి చెందిన వాడినని చెప్పగలను. నేను నా అంతవాడినై స్వేచ్ఛగా నడుచుకొంటాను. నానడవడి ఇది అని చెప్పడమెలా ? పూనికతో మూడు పోకడలూ పోగలను. అది నేర్చుకొన్నాను, ఇది నేర్చుకొన్నానని చెప్పడమెందుకు. అన్ని విద్యలూనేర్చుకొన్నాను. ఇతరులు ఎవరూ నన్ను చేరదీయరు. నేనే వారిని చేరదీస్తాను. నేను ఒంటరివాణ్ణి. చుట్టాలు ఎవ్వరూ లేరు. ఆదిలోనాకు సిరి ఉండేది. ఎక్కువగా నేను మంచివారితో కలిసి మసలు కుంటాను. అదే నా నివాసం.

©KTBS NOT TO BE REPUBLISHED

6. రాక్షస రాజా ! నీవు నాకు ఏవేవో ఇవ్వాలని కుతూహలపడుతున్నావు. నేను ఒంటరివాణ్ణి. నాకు సొమ్ములూ, భూములూ అక్కరలేదు. మూడడుగుల నేల మాత్రమివ్వు. దానితో తృప్తిపడి బ్రహ్మానందం పొందుతాను.

7. ఈ విధంగా అడిగిన వామనునితో బలిచక్రవర్తి ఇలా అన్నాడు.

8. భూభాగాన్ని కోరినావా ? ఏనుగులను కోరినావా ? గుఱ్ఱాలను కోరినావా ? యువతులను కోరినావా ? నీవు పసిపిల్లవాడవు. నీకు అడగడం తెలియదు. అందువల్ల మూడడుగులే అడిగినావు. నీ అదృష్టం అల్పమైనది కావచ్చు. ఇంతటి రాక్షస చక్రవర్తి ఇంత అల్పమైన దాన్ని ఎలా ఇస్తాడు ?

9. ఈ విధంగా పలికిన బలిచక్రవర్తితో చిరునవ్వుచిందే మొగంతో వామనుడు ఇలా అన్నాడు.

10. అయ్యా ! నేను బ్రహ్మచారిని. నాకు గొడుగూ, జందెమూ, కమండలమూ, మొలత్రాడూ, యోగదండమూ అవసరం. అంతేగాని భూములతో, ఏనుగులతో, గుర్రాలతో, స్త్రీలతో నాకు పనిలేదు. వాటికీ, నా నిత్యకృత్యాలకూ సంబంధం లేదు. కాదని త్రోసి వేయకుండా నా కోరికకు తగినట్లు ఆ మూడడుగల చోటిస్తే అదే నా పాలికి బ్రహ్మాండం.

11. రాక్షసరాజేంద్రా ! ఆశ మిక్కిలి పొడవైన త్రాడువంటిది. దానికి అంతులేదు, పూర్వ కాలంలో పృథుచక్రవర్తి, గయుడూ మొదలైన రాజులు సముద్రాలదాకా వ్యాపించిన సామ్రాజ్యాన్ని సంపాదించి పాలించారు. వారు సైతం వృథాగా కష్టపడినారేగాని అర్థంపైనా, కామంపైనా, ఆశలువదలలేదు. వారి ఆశలు నెరవేరనూలేదు.

12. సంతోషపడేవాడు ముల్లోకాలలోనూ గౌరవింపబడతాడు. సంతోషం కలవానికి ఎల్లప్పుడూ సుఖం కలుగుతుంది. సంతోషం లేకపోవడమే తిరిగి పుట్టడానికి కారణం. సంతోషంవల్ల మోక్షం సమకూరుతుంది. పూటపూటకూ తనంత తానుగా దొరికిన దానితో సంతోషపడితే తేజస్సు పెరుగుతుంది. నీళ్ళవల్ల నిప్పు చల్లారిన విధంగా సంతోషం లేకపోతే తేజస్సు తగ్గి పోతుంది. నీవు రాజువు కదా అని అవీ ఇవీ అన్నీ ఇమ్మని అడగడం న్యాయం కాదు. నాకు తగినట్లుగా నేను అడిగిన ఈ మూడడుగులూ కాదనకుండా ఇవ్వు. అదే చాలు. అంతే చాలు.

**నానార్థాలు.**

| | | |
|---|---|---|
| విరోచనుడు | – | సూర్యుడు, చంద్రుడు, అగ్ని, ప్రహ్లాదుని కొడుకు |
| దండము | – | నమస్కారము, కర్ర, శిక్ష, చతుర్విధోపాయాల్లో చివరిది |
| శిఖి | – | పిలక, నెమలి, కోడి, నిప్పు |

### పర్యాయ పదాలు

| | | |
|---|---|---|
| గాసి | – | శ్రమ, బాధ, కష్టం |
| నికేతనము | – | నిలయం, గృహం, భవనం |
| సురులు | – | దేవతలు, అమరులు |

### వ్యుత్పత్త్యర్థాలు

| | | |
|---|---|---|
| వైరోచనుడు | – | విరోచనుని కుమారుడు (బలి) |
| శిఖి | – | శిఖకలది (నెమలి) |
| వారాశి | – | నీటికి నిలయమైంది (సముద్రం) |

### ప్రకృతి వికృతులు

| | | |
|---|---|---|
| శ్రీ | – | సిరి |
| సంతోషం | – | సంతసం |
| ఆశ | – | ఆస |

### వివరణ

త్రేతాగ్నులు :– మూడు అగ్నులు 1. గార్హపత్యం, 2. దక్షిణాగ్ని 3. ఆహవనీయం

అభ్యాగతుడు :– మనం ఆహ్వానిస్తేవచ్చే వాడు అభ్యాగతుడు

అతిథి:– పిలవకనే భోజన సమయానికి వచ్చేవాడు అతిథి

### సంధులు

| | | | | | |
|---|---|---|---|---|---|
| నీవు | + | అరుదెంచు | = | నీవరుదెంచు; | ఉకారసంధి |
| రెండు | + | అడుగులు | = | రెండడుగులు; | ఉకారసంధి |
| అసుర | + | ఇంద్రుడు | = | అసురేంద్రుడు; | గుణసంధి |
| నిత్య | + | ఉచిత | = | నిత్యోచిత; | గుణసంధి |
| వామ | + | అక్షులు | = | వామాక్షులు; | సవర్ణదీర్ఘసంధి |

@KTBS NOT TO BE REPUBLISHED

**కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా సమాధానాలివ్వండి**

1. వడుగు రూపంలో ఎవరొచ్చారు ?
2. యజమానుడు ఎవరు ?
3. ఈ పాఠంలో పరమ యాచకుడెవరు ?
4. ఈ పాఠంలో ఈశ్వరుడు ఎవరు ?
5. వామనుడు బలిని ఎంతస్థలం అడిగాడు ?

**కింది ప్రశ్నలకు వివరంగా సమాధానాలివ్వండి.**

1. ధర్మ యుక్తంబుగా పలికిన వైరోచనుని వచనాలేవి ?
2. బలి చక్రవర్తితో వామనుడు తన్ను గూర్చి ఏమి చెప్పుకొన్నాడు ?
3. ఆశను గురించి ఈ పాఠంలో ఏమి చెప్పబడింది ?
4. ఈ పాఠ్యభాగాన్నిబట్టి 'తృప్తి'ని గురించి రాయండి ?

@KTBS
NOT TO BE REPUBLISHED

## Mohandas Gandhi Quotes

1. Honest differences are often a healthy sign of progress.
2. am prepared to die, but there is no cause for which I am prepared to kill.
3. It is unwise to be too sure of one's own wisdom. It is healthy to be reminded that the strongest might weaken and the wisest might err.

# ౯. ద్రౌపది వేదన

తిక్కన సోమయాజి–

E8X2W3

['కవిత్రయం' అని పేరొందిన ముగ్గురు తెలుగు కవులలో తిక్కన రెండవవాడు. ఈ కవి క్రీ.శ.13వ శతాబ్దంలో ఉండేవాడు. నెల్లూరును పాలించిన మనుమసిద్ధి అనే రాజు వద్ద మంత్రిగా, ఆస్థాన కవిగా ఉండేవాడు. నిర్వచనోత్తర రామాయణం అనే కావ్యాన్ని రచించి మనుమసిద్ధికి అంకితం చేశాడు. సంస్కృతంలో వ్యాసుడు రచించిన శ్రీ మహాభారతాన్ని తిక్కన తెలిగించాడు. విరాటపర్వం నుంచి స్వర్గారోహణపర్వందాకా మొత్తం పదిహేను పర్వాలను తిక్కన ఒక్క చేతిమీదిగా తెలుగు చేశాడు. తెలుగు పదాలకు పట్టంకట్టి, తెలుగుమాటలకున్న శక్తిని నిరూపించిన కవి ఇతడు. పాత్రల సంభాషణద్వారా కథ నడపడంలో ఇతడు సిద్ధహస్తుడు. ఇతని రచనలో నాటకీయత ఎక్కువ. ఈ పద్యాలను చదువుతుంటే కళ్ళముందు ఒక నాటకం కనిపిస్తున్నట్టుగా ఉంటుంది.

ప్రస్తుత పాఠం ఉద్యోగపర్వం తృతీయాశ్వాసంలోనిది.
ప్రాచీన కవిత్వంలోని పద్యాలను పరిచయం చేయడం ఈ పాఠోద్దేశం]

@KTBS
NOT TO BE REPUBLISHED

✦ 1. చ. వరమున బుట్టితిన్, భరతవంశము జొచ్చితి; నందు పాండు భూ
వరునకు గోడలైతి, జనవంద్యుల బొందితి ; నీతి విక్రమ
స్థిరులగు పుత్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపుగాంచితిన్
సరసిజనాభ, యిన్నిట ప్రశస్తికి నెక్కినదాన నెంతయున్

2. వ. అట్లుంగాక

3. ఉ. నీవు సుభద్రకంటె కడు నెయ్యము గారవముందలిర్పసం
భావన సేయుదిట్టె నను, బంకజనాభ, యొకండు రాజసూ
యావభృథంబునందు శుచియై పెనుపొందిన వేణిపట్టి, యీ
యేవురు జూడగా సభకు నీడ్చె గులాంగన నిట్లొనర్తురే ?

4. చ. అరయమి చేసి కోడలనకప్పుడు దాసిగజేసె నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవగ వీరలతోన యేను జె
చ్చెరజని కోటరంబు దగజేయుదునో ! యటుగాక పాడియై
వరవుడ మోపి చేయుదునొవారికి, మాధవ నిశ్చయింపుమా !

5. వ. అని యుగ్గడించి

6. ఉ. ద్రౌపది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మున విడ్చివెంద్రకల్
దావల చేతబూని, యసితచ్ఛవి బొల్చు మహాభుజంగమో
నావిలసిల్లి వ్రేలగ మనంబున బొంగు విషాదరోషముల్
గావగలేక బాష్పములు గ్రమ్మగ, దిగ్గన లేచి యార్తయై.

7. వ. గోవిందు ముందటంబెట్టి యిట్లనియె

8. కం. ఇది దుస్ససేను వ్రేళ్లం
దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి కౌ
రవుల కడ దీఱుమాటల
యవసరమున దలపవలయు నచ్యుత, దీనిన్.



## కొత్తపదాలు

భూవరుడు; సహజన్ములు; కులాంగన; క్రొమ్ముడి; ఆర్త; ద్రౌపది; జనవంద్యులు; ప్రశస్తి; కోటరము; అసితచ్ఛవి; తీఱుమాటలు; పడయు; రాజసూయావబృథము; వరవుడము; బాష్పములు; అచ్యుతుడు.

## కఠిన పదాలకు అర్థాలు

ప 1. వరమున =వర ప్రభావం వల్ల; భూవరుడు=రాజు; జనవంద్యులు=జనంచేత పొగడ బడే వాళ్ళు; సహజన్ములు=తోబుట్టువులు; ప్రశస్తి =పేరు రావడం (కీర్తి);

ప. 2. అట్లుంగాక = అదీగాక;

ప. 3. కడు=చాలా; నెయ్యము=ప్రేమ; గారవము=గౌరవం; సంభావన=భావించడం; రాజసూయ+అవబృధంబు=రాజసూయమనే గొప్పయాగం చేశాక చేసిన పవిత్ర స్నానం; శుచి= పవిత్రం; వేణి=జడ; ఏవురు=అయిదు మంది; కుల+ అంగన=పతివ్రతా స్త్రీ;

ప. 4. అరయమి=గమనించక పోవడం చేత; దాసి=పనిమనిషి; పాలి=దగ్గర; చెచ్చెర=వెంటనే; కోటరము=కోడలిగా ఉండడం; పాడి=ధర్మం; వరవుడము=దాస్యం;

వ 5. ఉగ్గడించి=చెప్పి;

ప 6. ద్రోవది=ద్రౌపది; బంధురంబు=దట్టమైన; క్రొమ్ముడి=అపుడే వేసుకున్న కొప్పుముడి; వలచేత=కుడిచేతిలో; అసితచ్ఛవి=నల్లని కాంతితో; మహాభుజంగమో=పెద్దపామో; నా=అనేటట్లు; విలసిలి=ప్రకాశించి; విషాదం=దుఃఖం; రోషములు=ప్రతీకారభావన; కావగలేక=భరించలేక; బాష్పములు=కన్నీళ్ళు; ఆర్తయై=దుఃఖంతో కూడినదై;

7. గోవిందు=శ్రీ కృష్ణుని;

ప 8. దుస్ససేనుడు=దుశ్శాసనుడు; తవిలి=తగిలి; త్రెవ్వి=తెగి; అచ్యుత=నాశనం లేనివాడా (శ్రీ కృష్ణా !);

## సారాంశం

ప.1.శ్రీకృష్ణా, నేను వరం వల్ల పుట్టాను. భరతవంశంలోకి ప్రవేశించాను. పాండుమహారాజుకు కోడలినయ్యాను. జనం కీర్తించే భర్తలను పొందాను. నీతి, విక్రమం ఉండే పుత్రులను పొందాను. తోబుట్టువుల ఆశ్రయం పొందాను. ఇన్ని విషయాలలో నేను ప్రశస్తి పొందాను.

ప.2.అదీ కాకుండా

ప.3.పంకజనాభుడైన శ్రీ కృష్ణా, నీవు నన్ను సుభద్రకంటే ఎక్కువ ప్రేమాదరాలతో చూస్తావు. ఇలాంటి నన్ను రాజసూయయాగం ముగిశాక పవిత్రస్నానం చేసి, శుచియైన నా జడను ఒకడు పట్టి ఈ ఐదుమంది చూస్తుండగా సభకు ఈడ్చాడు. కులాంగనను ఇలా చేస్తారా ?

©KTBS NOT TO BE REPUBLISHED

ప.4.ఆలోచన లేకుండా కోడలని కూడా చూడకుండా ధృతరాష్ట్రుడు నన్ను దాసిగా చేశాడు. ఆ పెద్దమనిషి దగ్గరికి నా భర్తలు వెళ్తే నేను కూడా వాళ్ళతో పాటు, వెంటవెంటనే వెళ్ళి తగినట్లుగా కోడరికం చేయాలా ? లేక ధర్మప్రకారం వాళ్ళకు దాస్యం చేయాలా ? మాధవా, నీవే నిశ్చయించు.

ప.5.అని ఇలా పలికి

ప.6.ద్రౌపది దట్టమైన తన కొప్పుముడిని వేగంగా విదిలించింది. వెంట్రుకలను కుడిచేత్తో పట్టుకుంది. అది నల్లగా నిగనిగలాడుతున్న పెద్ద సర్పంలాగా ఉంది. ఆమె మనస్సులో దుఃఖం, కోపం రెండూ పొంగుతున్నాయి. దానిని భరించలేక పోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. గబుక్కన లేచింది. దుఃఖంతో ఆ కురులను

ప.7.గోవిందుని ముందుంచి చూపుతూ

ప.8.ఇది దుశ్శాసనుని వ్రేళ్ళలో తగుల్కొని సగం తెగిపోతే మిగిలినవి. కౌరవుల వద్ద మాట్లాడేటపుడు అచ్యుతా, దీన్ని గురించి తప్పక ప్రస్తావించాలి. (అని అంది)

**వ్యాకరణాంశాలు :**

## పర్యాయ పదాలు

అ. పుట్టు – జన్మించు, ప్రభవించు

ఆ. ప్రశస్తి – కీర్తి, పేరొందు

## ప్రకృతి వికృతులు

స్నేహము – నెయ్యము

గౌరవము – గారవము

ద్రౌపది – ద్రోవది

## సంధి

అ. వరమునన్ + పుట్టితిన్ – వరమున బుట్టితిన్; ద్రుతప్రకృతిక సంధి

ఆ. రాజసూయ + అవభృథము – సవర్ణదీర్ఘసంధి

ఇ. ఈ + ఏవురు – యడాగమసంధి

ఈ. కుల + అంగన – సవర్ణదీర్ఘసంధి

ఉ. ఆ + మహాపురుషుడు – త్రికసంధి

ఊ. లేచి + ఆర్తయై – యడాగమసంధి

©KTBS NOT TO BE REPUBLISHED

**సమాసాలు** :

1. భరత వంశము – భరతుని యొక్క వంశము; షష్ఠీతత్పురుష సమాసం
2. పాండుభూవరుడు – పాండు అను పేరుగల రాజు; సంభావనాపూర్వపద కర్మధారయ సమాసం
3. సరసిజనాభుడు – నాభిలో పద్మం కలవాడు; బహువ్రీహి సమాసం
4. క్రొమ్ముడి – క్రొత్తముడి; విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
5. మహాభుజంగము – పెద్దదైనపాము; విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
6. అచ్యుతుడు – నాశనము లేనివాడు; నఞ్తత్పురుష సమాసము

**ఈ కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానం రాయండి** :

1. తన ప్రశస్తి గురించి ద్రౌపది శ్రీ కృష్ణునితో ఏమనింది ?
2. శ్రీ కృష్ణుని ప్రేమ గౌరవాల గురించి ద్రౌపది పలుకులను తెల్పండి ?
3. తన భర్తల మౌనం గురించి ద్రౌపది ఏమని దుఃఖించింది ?
4. ధృతరాష్ట్రుని గురించి ద్రౌపది ఎలా మాట్లాడింది ?
5. కౌరవుల వద్ద ప్రస్తావించమని ద్రౌపది దేనిని గురించి తెల్పింది ?

**ఈ కింది ప్రశ్నలకు పదిపంక్తులలో జవాబు రాయండి** :

1. ద్రౌపది వేదనను మి సొంత మాటల్లో రాయండి ?

**ఈ కింది పద్యపాదాలకు సందర్భాలను తెల్పండి** :

1. ఇన్నిట ప్రశస్తికి నెక్కిన దాన నెంతయున్.
2. కులాంగన నిట్లొనర్తురే ?
3. దిగ్గనలేచియార్తయై.
4. మాధవ, నిశ్చయింపుమా !
5. తలపవలయు నచ్యుత వీనిన్.

NOT TO BE REPUBLISHED ©KTBS

# గద్యభాగం

## ౬. 'భారతరత్న' మోక్షగుండం విశ్వేశ్వరయ్య

X2A1N1

జానమద్ది హనుమచ్ఛాస్త్రి -

[ఈ పాఠంలో ఒక వ్యక్తిగాకాక శక్తిగా జీవించిన 'భారతరత్న' మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారి జీవితవృత్తాంతం చిత్రింపబడింది.

రాజనీతి, నిష్కామ దేశభక్తి, అపారబుద్ధిశక్తి, అచంచలకార్యదీక్ష, వీటన్నింటిని మించిన నిలువెత్తు నీతి, నిజాయితీలు మూర్తీభవించిన ఈ నిష్కామ కర్మయోగి జీవితం అందరికీ ఆదర్శప్రాయం, ఆచరణ యోగ్యం. యావద్భారతం ఈ ప్రతిభాశాలి సేవలకు చిరఋణి.

ఇట్టి ఆదర్శప్రాయుడు 'నభూతో, న భవిష్యతి'. కృషి చేస్తే మానవుడే, మహనీయుడవుతాడనడానికి ప్రత్యక్షనిదర్శనం విశ్వేశ్వరయ్యగారి జీవితం.

ఈ పాఠం జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారు రచించిన 'సుప్రసిద్ధుల జీవితవిశేషాలు' అనే పుస్తకం నుండి గ్రహింపబడింది. వీరు వృత్తిరీత్యా అధ్యాపకులు. హనుమచ్ఛాస్త్రిగారు తెలుగు, కన్నడభాషాసాహిత్యాలలో మంచిపండితులు.'మా సీమకథలు', 'కడపసంస్కృతి–దర్శనీయస్థలాలు', 'కన్నడ సాహిత్య సౌరభం' అనేవి వీరి రచనలు. 'గణపతి' అనేగ్రంథం వీరి కన్నడానువాద పరిశోధన గ్రంథం.

విశ్వేశ్వరయ్యగారిలాంటి మహాపురుషుని జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం మరియు ఉత్తేజకారకం.]

©KTBS NOT TO BE REPUBLISHED



"ప్రజల సంపాదనాశక్తిని, కార్యదక్షతను, నైపుణ్యాన్ని వివిధములైన చేతిపనుల ద్వారా పెంపొందించాలి. చేతనైనవారందరూ కష్టించిపని చేసే వీలుకల్పించాలి. యాంత్రిక శక్తిని వినియోగించుకొని దేశ పారిశ్రామిక ప్రగతికి ముందంజవేయాలి. భారతీయులలో ప్రబలంగావున్న 'అంతా తలరాత' అన్న అలసభావం రూపుమాపి నిరంతర కృషిద్వారా సంపదను సాధించే దీక్షను, కర్తవ్యపాలనను ప్రజలలో రేకెత్తించుట ప్రభుత్వం కర్తవ్యం".

1912 లో మైసూరుసంస్థాన దివానుగా అధికారాన్ని చేపడుతూ శ్రీ విశ్వేశ్వరయ్య చేసిన ప్రసంగంనుండి పై వాక్యాలు ఉటంకింపబడినాయి. విశ్వవిఖ్యాత ఇంజనీర్ గా, పాలనాదక్షుడుగా, నిష్కామ దేశభక్తుడుగా అఖండ కీర్తిని ఆర్జించిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

విశ్వేశ్వరయ్య పూర్వీకులు నేటి ప్రకాశం జిల్లాలోని మోక్షగుండం గ్రామంనుండి సుమారు రెండు శతాబ్దాల క్రితం కర్ణాటకరాష్ట్రం (అప్పట్లో మైసూరు) లోని, చిక్కబళ్ళాపురం సమీపంలోని ముద్దేనహళ్ళిలో స్థిరపడినారు. అక్కడే విశ్వేశ్వరయ్య 1861 సెప్టంబర్ 15వ తేదీన జన్మించారు. తండ్రి శ్రీనివాసశాస్త్రి. తల్లి వెంకటలక్ష్మమ్మ. వారిది సామాన్య కుంటుంబం. బాల్యంలోనే తండ్రి మరణించాడు. మేనమామ రామయ్య బాలుడైన విశ్వేశ్వరయ్యను చేరదీసి, బెంగళూరు సెంట్రల్ కాలేజీలో చదువుకొనే ఏర్పాటు చేశాడు.

విశ్వేశ్వరయ్యగారి విద్యార్థి జీవితం విద్యాభ్యాసం సాగించేవారందరికి దిక్సూచి. మేనమామల ఇంట్లోవుంటూ కాలేజీ ఫీజులకోసం ప్రైవేట్ ట్యూషన్ చెబుతూ 1881 లో పట్టభద్రులయ్యారు. సెంట్రల్ కాలేజీ ప్రిన్సిపల్ ఛార్లెస్ వాటర్స్ విశ్వేశ్వరయ్యనెంతగానో ప్రోత్సహించాడు. గణితంలో అసామాన్య ప్రతిభగల విశ్వేశ్వరయ్యగారినుండి అధ్యాపకులే తమ సంశయాలను పరిష్కరించుకునేవారు. శిష్యుని కుశాగ్రబుద్ధికి ముగ్ధుడైన ప్రిన్సిపల్ తాను ఉపయోగించుకునే వెబ్‌స్టర్ డిక్షనరీని బహుమానంగా ఇచ్చాడు. తన కోటుకున్న బంగారు బొత్తములను భార్య ద్వారా శిష్యుడు విశ్వేశ్వరయ్యకు పంపారు. అదీ ఆనాటి గురుశిష్యుల అనుబంధం, శిష్యవాత్సల్యం.

ఇటువంటి పెద్దలు ఆదరించినందువల్లనే బాలుడైన డా.ఎం.వి; సర్.ఎం.వి;.'భారతరత్న' ఎం. వి. అంటూ ప్రస్తుతింపబడినాడు. అప్పట్లో మైసూరు సంస్థాన దివానుగా ఉండిన దివాన్ రంగాచార్లుగారు విశ్వేశ్వరయ్య విద్యావినయములను గుర్తించి, ఇంజనీరింగ్ విద్యాభ్యాసం సాగించేందుకు స్కాలర్‌షిప్ మంజూరుచేసి, పూనేకు పంపారు. ఇంజినీరింగ్ పరీక్షలో బొంబాయిరాష్ట్రంలో సర్వప్రథముడుగా ఉత్తీర్ణులైన విశ్వేశ్వరయ్యగారిని రాష్ట్రప్రభుత్వం నేరుగా అసిస్టెంట్ ఇంజనీరుగా నియమించింది. ఏడాదిలోపునే ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా నియమించారు. ఆరోజుల్లో అందులోను అంత త్వరలోనే పదవీ ఉన్నతినిపొందడం చాలా అరుదు. పూనేలో ఉన్నప్పుడే గోఖలే, తిలక్, రాణడే వంటి మహనీయుల సాహచర్యం విశ్వేశ్వరయ్యగారికి లభించింది. గాంధీజీ, నెహ్రూల కంటే వయస్సులో పెద్ద విశ్వేశ్వరయ్య.

ఆంగ్లపాలకులు విశ్వేశ్వరయ్యగారి కార్యదీక్షను గుర్తించి, ప్రపంచజలాశయాలలో ఒకటిగ గొప్పదైన సుక్కూర్ బరాజ్ (సింధురాష్ట్రం) నిర్మాణానికి ప్రత్యేక ఇంజనీర్‌గా నియమించారు. బ్రహ్మాండమైన ఈ జలాశయ నిర్మాణం నాలుగేళ్ళలో పూర్తి అయింది.

© KTBS NOT TO BE REPUBLISHED

1901 లో భారత ప్రభుత్వ ప్రతినిధిగా విశ్వేశ్వరయ్యగారు జపాన్ దేశం వెళ్ళి అచ్చట కుటీరపరిశ్రమల తీరుతెన్నులను అవలోకించారు. ఆ పద్ధతిలో కుటీర పరిశ్రమల అభివృద్ధికి బృహత్పథకాన్ని సిద్ధపరిచి ప్రభుత్వానికి అందించారు. జపాన్ పర్యటనానంతరం విశ్వేశ్వరయ్యగారు పూనానగర నీటిసరఫరా పథకాన్ని రూపొందించారు.ఈ నిర్మాణకాలంలోనే ఆటోమేటిక్ స్లూస్‌గేట్ రూపొందించారు. ఈ స్లూస్‌గేట్ నిర్మాణం ప్రపంచ ఇంజనీర్ల మన్ననలందుకున్నది. ఈ కొత్త పరిశోధనను తన పేరుమీద పేటెంట్ చేసుకోవలసిందిగ మిత్రులు సూచించారు. తన కార్యనిర్వహణలో భాగంగా సాగినది కాన పేటెంట్ తీసుకోవటం సముచితం కాదన్నాడు. లార్డ్‌కిచనర్ స్లూస్ గేట్ నిర్మాణంలో విశ్వేశ్వరయ్య ప్రతిభను కొనియాడాడు.

1906 లో ఏడెన్ నగరం నీటి సరఫరాప్రణాళికను రూపొందించారు. ప్రభుత్వం విశ్వేశ్వరయ్య గారిని సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా నియమించింది. అప్పుడే కొల్హాపూర్, ధార్వాడ, బీజాపూర్ మొదలగు పట్టణాలలో మంచినీటి పథకాలను సిద్ధపరిచారు. బొంబాయి రాష్ట్రప్రభుత్వోద్యోగాన్ని స్వయంగా వదులుకొన్నారు. రెండు సంస్థానాలనుండి చీఫ్ ఇంజనీర్ పదవులు చేపట్టమని ఆహ్వానాలు వచ్చాయి. అన్నింటిని తిరస్కరించి ఇటలీ, రష్యా, ఫ్రాన్స్, జర్మనీ, మొదలగు దేశాలలోని బృహన్నిర్మాణములను పరిశీలించి, ఆయాదేశ శాస్త్రవేత్తలతో సంప్రదింపులు జరిపి, 1909 లో స్వదేశం వచ్చారు.

NOT TO BE REPUBLISHED @KTBS

ఇటలీ పర్యటనలో ఉన్నపుడే హైదరాబాద్ నగర రక్షణ పథకం నిర్మించుటకు స్పెషల్ చీఫ్ ఇంజనీరుగా ఆహ్వానించాడు నిజాం. విశ్వేశ్వరయ్యగారి నేతృత్వంలో సాగినవే హుసేన్‌సాగర్, హైదరాబాదు నగర విస్తృత పథకాలు.

స్వరాష్ట్రమైన మైసూరు సంస్థానాన్ని ఆదర్శ సంస్థానంగా తీర్చిదిద్దినవారు ఆయన. చీఫ్ ఇంజనీర్‌గా, ఆ తర్వాత దివాన్‌గా పని చేసిన ఆరేళ్ళలో అరువదేళ్ళ అభివృద్ధిని సాధించారు. హెబ్బాళ్ వ్యవసాయ కళాశాల, మైసూరు విశ్వవిద్యాలయం, ఛేంబర్ ఆఫ్ కామర్స్, సోప్‌ఫ్యాక్టరి, కన్నడ సాహిత్యపరిషత్, మున్నగు వాటిని నెలకొల్పారు. విశ్వేశ్వరయ్యగారి ప్రజ్ఞాప్రతిఫలంగా నిర్మింపబడినదే కృష్ణరాజసాగర్. లక్షలాది ఎకరాల మెట్టభూములు సస్యశ్యామలంగా మారాయి. బృందావన్ ఉద్యానవనం వారి ప్రకృతి ప్రేమకు నిదర్శనం. భారతదేశ సంస్థానాలలో మొదటి ఉక్కుకర్మాగారం నెలకొల్పినది మైసూరు.



విశ్వేశ్వరయ్యగారు 1921లో భారత ఉత్పత్తిదారుల సమాఖ్యను నెలకొల్పి జీవితాంతం ఆ సమాఖ్య అధ్యక్షులుగా పని చేశారు. 1922లో అఖిలపక్ష రాజకీయ సమ్మేళనానికి, 1923లో ఇండియన్ సైన్స్ కాంగ్రెసుకు అధ్యక్షత వహించారు.

కర్తవ్యనిర్వహణలో, నిజాయితీలో అటువంటివారు అరుదు. దివాన్ పదవి స్వీకరించేముందు బంధుమిత్రులను ఆహ్వానించారు. "నేను దివాన్ పదవిలో ఉండగా ఎటువంటి ఉద్యోగాలు కోరమని, సిఫార్సులు చేయమని వాగ్దానం చేయమన్నారు". తన బంధువులను ప్రభుత్వోద్యోగాలనుండి తప్పించి, ఇతర వృత్తులను చేపట్టుటకు సొంత పైకంయిచ్చారు.

గాంధీజీ, విశ్వేశ్వరయ్యగార్లు దేశాభివృద్ధి సాధనలో భిన్నదృక్పథాలు కలవారు. గాంధీజీ గ్రామీణ పరిశ్రమలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. విశ్వేశ్వరయ్యగారు భారీపరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చి కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

భారతదేశంలోని పెద్దజలాశయాలు, ఆనకట్టలు, నిర్మించడంలో వారి సలహాలను ప్రభుత్వం గొప్పగా భావించేది. తొంభైఏళ్ళ వయసులో ప్రధాని నెహ్రూ ఆహ్వానాన్ని మన్నించి, పాట్నావద్ద గంగానదిపై వంతెన నిర్మాణ పథకాన్ని కొందరు ఇంజనీర్ల బృందంతో రూపొందించారు. తుంగభద్ర ప్రాజెక్టు పథక శిల్పివారే.

విశ్వేశ్వరయ్య నిజాయితీకి సాకారం. ఒకమారు విదేశీపర్యటనకు సిద్ధమయ్యారు. కొంత పైకం కావల్సివచ్చింది. మైసూరు బ్యాంక్ మేనేజర్ వారినెంతో గౌరవంగా లోపలికి తీసుకెళ్ళారు. అన్ని దరఖాస్తులు సిద్ధమైనాయి. విశ్వేశ్వరయ్య తమవద్దవున్న భారత ప్రభుత్వ రుణపత్రాలను ఇచ్చి తాకట్టు పెట్టుకోమన్నారు. మేనేజర్ ఆశ్చర్యంతో "తామ తాకట్టు పెట్టడమా ! ఇది మీరు నెలకొల్పిన బ్యాంక్" అంటూ తిప్పి ఇవ్వగా విశ్వేశ్వరయ్య తీసుకోలేదు. బ్యాంకువారు తక్కువ వడ్డీ సూచించగా అందరికీ విధించే వడ్డీ వేయమన్నారు. ఎక్కువ వడ్డీ వేయమని కోరినవారు విశ్వేశ్వరయ్యగారొక్కరే అన్నారు బ్యాంక్ మేనేజర్.

విశ్వేశ్వరయ్యగారి వ్యక్తిగత జీవితం అతి క్రమశిక్షణతోవుండేది. కాలనియమాన్ని ఆహార విహారనియమాలను కచ్చితంగా పాటించిన విశ్వేశ్వరయ్య 100 సంవత్సరాల వయస్సులో కళ్ళద్దాలు లేకుండా చదివేవారు. "గంధపు చెక్కవలె సేవలోఅరిగిపో కాని ఇనుములా త్రుప్పు పట్టవద్దు" అనునది వారి జీవనధ్యేయం. దేశ విదేశాలలోని విశ్వవిద్యాలయాలు వారిని సత్కరించాయి. 1961లో విశ్వేశ్వరయ్య గారి శతజయంతి ఉత్సవాలకు భారత ప్రధాని నెహ్రూ విచ్చేశారు. "మేము మాటలతో కాలయాపన చేశాం. మీరు నిరంతర క్రియాశూరులై నవభారత నిర్మాణానికి కృషి చేసిన మహనీయు"లంటూ నివాళులర్పించారు నెహ్రూ.

భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యగారిని 'భారతరత్న' బిరుదంతో సత్కరించింది. విశ్వేశ్వరయ్య ' ప్లాన్డ్ ఎకానమి ఆఫ్ ఇండియా ',' రీకన్‌స్ట్రక్టింగ్ ఇండియా మెమాయిర్స్ ఆఫ్ వర్కింగ్ లైఫ్ ' (ఆత్మకథ) రచించారు. జీవితాంతం దేశప్రగతికి, ప్రజా శ్రేయస్సుకు కృషి చేసిన విశ్వేశ్వరయ్యగారు 12-4-1962 లో దివంగతులయ్యారు.

## 1. **కొత్తపదాలు** :

ఆదర్శం; ఉటంకింపబడినాయి; ఉత్తీర్ణులు; కార్యదక్షత; కుశాగ్రబుద్ధి; కొనియాడు; క్రియాశూరులు; జీవన ధ్యేయం; తిరస్కరించు; దివంగతులు; నిష్కామ; నేతృత్వం; నెలకొల్పారు; నివాళులు; ప్రగతి; ప్రస్తుతింపబడినాడు; ప్రబలం; ప్రతిభ; ప్రజ్ఞ; ప్రతిఫలం; ప్రాధాన్యత; బ్రహ్మాండం; బృహనిర్మాణములు; భిన్న దృక్పథాలు; రూపొందించు; విస్తృతపథాలు; స్లూస్ గేట్; సముచితం; సిద్ధపరచు; సంప్రదింపులు; సస్యశ్యామలం; సమ్మేళనం; సాకారం.

## 2. **అర్థాలు** :

1. అలసత్వం=ఉదాసీనం, నిర్లిప్తం; దక్షత=సామర్థ్యం; ముందంజ=ముందు అడుగు; రేకెత్తించు=కలిగించు; రూపుమాపు=పోగొట్టు, నశింపచేయు; దీక్ష=పట్టుదల; విఖ్యాతం=ప్రసిద్ధి; నిష్కామం=కోరికలులేని, ప్రతిఫలంకోరని; సంశయం=సందేహం; వాత్సల్యం=బిడ్డలపట్ల గలప్రేమ;

© KTBS NOT TO BE REPUBLISHED

ప్రతిభ=అప్పటికి అప్పుడు వికసించెడి బుద్ధి; సాహచర్యం=స్నేహం; బృహత్=గొప్ప; సంప్రదింపులు=చర్చలు; నేతృత్వం=నాయకత్వం; ఉద్యానవనం=తోట; విస్తృతం=విశాలం; నివాళి=ఆరతి, పొగడు; తరగదు=తగ్గదు; అవగాహన=గ్రహింపు; దిక్సూచి=దిక్కును సూచించేది; కాలయాపన=ఆలస్యం; సత్కారం=గౌరవం, సన్మానం; మన్నన=గౌరవం; బొత్తాములు=గుండీలు; దృక్పథం=అభిప్రాయము; ప్రగతి=అభివృద్ధి; సాకారం=రూపం;

### 3. వ్యుత్పత్త్యర్థము

వాత్సల్యం–వత్సలుల (బిడ్డల) పట్ల గలభావం/ప్రేమ.

### 4. నానార్థం

వృద్ధి–వడ్డీ; అభివృద్ధి; సంతోషం; గుణకారం.

### 5. ప్రకృతి - వికృతులు

| | | |
|---|---|---|
| కీర్తి | – | కీరితి |
| పట్టణము | – | పత్తనము |
| కృషి | – | కరిసెము. |

### 6. వ్యతిరేక పదాలు :

| | | |
|---|---|---|
| స్తుతి | × | నింద |
| ఉచితం | × | అనుచితం |
| సమ్మతి | × | అసమ్మతి |
| తరుగు | × | పెరుగు |
| జయంతి | × | వర్ధంతి |
| అధికారం | × | అనధికారం |
| అర్హత | × | అనర్హత |
| సంశయం | × | నిస్సంశయం |
| ఉత్సాహం | × | నిరుత్సాహం |

@KTBS
NOT TO BE REPUBLISHED

**7. పర్యాయపదాలు** :

1. పైకం – ధనం; రూపాయలు; డబ్బు; కాసులు.
2. జాబు – ఉత్తరం; లేఖ
3. పత్రం – కాగితం; ఆకు
4. తల్లి – మాత; జనని; అంబ; అమ్మ

**8. జంటపదాలు** :

తీరుతెన్నులు; ఆహారవిహారాలు; విద్యావినయాలు.

**9. అన్యభాషాపదాలు** :

**హిందుస్థానీపదాలు** : సిఫార్స్, దివాన్, కార్ఖానా.

**ఆంగ్లభాషాపదాలు** :

ఆటోమేటిక్ స్లూస్‌గేట్ : జలాశయాలలో నీటిమట్టం పెరిగినపుడు తనంతట తానే నీళ్ళు బయటికి పోవడానికి ఆనకట్టలకు నిర్మించిన తలుపు.

పేటెంట్ : సర్వహక్కులను కలిగి ఉండటం.

**10. సంధులు**

1. ఉకారసంధులు :

| | | | | |
|---|---|---|---|---|
| ముందు | + | అంజ | = | ముందంజ |
| బాలుడు | + | ఐన | = | బాలుడైన |
| నాలుగు | + | ఏళ్ళు | = | నాలుగేళ్ళు |

2. సవర్ణదీర్ఘసంధి :

శిక్షణ + అవకాశాలు = శిక్షణావకాశాలు.

3. యణాదేశసంధి :

అతి + అవసరం = అత్యవసరం

**11. సమాసాలు** :

బంగారు బొత్తాములు – బంగారువైన బొత్తాములు; విశేషణ పూర్వపదకర్మధారయ సమాసం; ఆదర్శసంస్థానం – ఆదర్శమైన సంస్థానం; విశేషణ పూర్వపదకర్మధారయ సమాసం. నాలుగేళ్ళు – నాలుగు అయిన ఏళ్ళు; ద్విగు సమాసం; ఆహారవిహారాలు – ఆహారము మరియు విహారము; ద్వంద్వ సమాసం.

@KTBS NOT TO BE REPUBLISHED

**12. ఈ క్రింది వాక్యాలకు సందర్భాలు రాయండి.**

1. కర్తవ్య పాలనను ప్రజలలో రేకెత్తించుట ప్రభుత్వ కర్తవ్యం.
2. తాము తాకట్టు పెట్టడమా !
3. నవభారత నిర్మాణానికి కృషి చేసిన మహనీయులు.

**13. చిన్నప్రశ్నలు :**

1. విశ్వేశ్వరయ్య పూర్వీకులు ఎక్కడినుండి వచ్చారు ? ఎక్కడ స్థిరపడ్డారు ?
2. విశ్వేశ్వరయ్య తల్లిదండ్రులెవరు ?
3. భారత ప్రభుత్వ ప్రతినిధిగా విశ్వేశ్వరయ్య ఏదేశం వెళ్ళారు ?
4. విశ్వేశ్వరయ్య నేతృత్వంలో సాగిన హైదరాబాద్ విస్తృత పథకాలు ఏవి ?
5. విశ్వేశ్వరయ్య ఏ సంస్థానానికి దివాను ?
6. విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం ఏ బిరుదుతో సత్కరించింది ?
7. విశ్వేశ్వరయ్య పూనేలో ఉన్నప్పుడు ఎవరెవరి సాహచర్యం లభించింది ?
8. విశ్వేశ్వరయ్య రచనలు ఏవి ?
9. విశ్వేశ్వరయ్య జీవిత ధ్యేయం ఏమిటి ?
10. విశ్వేశ్వరయ్య శతజయంత్యుత్సవాల సందర్భంగా నెహ్రూ ఏమని నివాళులు అర్పించారు ?

**14. పెద్ద ప్రశ్నలు :**

1. విశ్వేశ్వరయ్య ప్రసంగంలోని వాక్యాలను తెలపండి ?
2. సెంట్రల్ కాలేజీలో విశ్వేశ్వరయ్య విద్యార్థి జీవితాన్ని గురించి తెలపండి ?
3. విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ విద్యాభ్యాసాన్ని వివరించండి ?
4. విశ్వేశ్వరయ్య జపాన్ పర్యటనను గురించి రాయండి ?
5. విశ్వేశ్వరయ్య మైసూరు సంస్థానాన్ని తీర్చిదిద్దిన విధానాన్ని వివరించండి ?
6. విశ్వేశ్వరయ్య కర్తవ్య నిర్వహణను గురించి రాయండి ?
7. విశ్వేశ్వరయ్య నిజాయితీని వివరించండి ?
8. విశ్వేశ్వరయ్య వ్యక్తిగత జీవితాన్ని గురించి తెలపండి ?

NOT TO BE REPUBLISHED ©KTBS

# 7. ఉగాది పండుగ

I7B4X2

(సంస్కృతిని గూర్చి తెలిపేవి పండుగలు. పండుగనే పర్వమని, పబ్బమని పిలుస్తారు. పండుగలు వ్యక్తి, సంఘ, జాతీయపరమైనవని మూడు విధాలు. వ్యక్తి పరమైనవి జయంతులు. సంఘ పరమైనవి నోములు, వ్రతాలు. జాతీయపరమైన పండుగలు మన పూర్వ సంస్కృతిని, మహాపురుషుల జన్మదినాలను స్మరింపజేస్తాయి. దీపావళి, సంక్రాంతి, దసరా, ఉగాది మొదలైన పండుగలు మన సంస్కృతిని ప్రతిబింబింపజేస్తే, శ్రీ కృష్ణజయంతి, శ్రీ రామనవమి, గాంధీజయంతి మొదలైనవి వ్యక్తుల జన్మదినాలను గుర్తింపజేస్తాయి.

ఈ పాఠ్య భాగం రచయిత శ్రీ డి. భువనానందగారు ప్రస్తుతం బెంగుళూరులోని వివేకనగర్ తెలుగు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.)



మన పండుగలలో 'ఉగాది' ముఖ్యమైన పండుగ. ఉగాదిని 'యుగాది' అంటారు. యుగాలు నాలుగు. అవి 1. కృతయుగం 2. త్రేతాయుగం, 3. ద్వాపర యుగం. 4. కలియుగం. మనము ఇప్పుడు కలియుగంలో ఉన్నాము. ఈ కలియుగం ప్రారంభమైన రోజును యుగాది అని పిలిచారు. అది వాడుకభాషలో 'ఉగాది' గా పిలువబడుతోంది.

చైత్ర శుక్ల పాడ్యమి మనకు సంవత్సరాది. తెలుగు నెలలో చైత్రం మొదటి నెల. ఏ పూర్ణిమనాడు చిత్రా నక్షత్రం వస్తుందో ఆ నెల చైత్రం. ఈ పండుగ రోజు మామిడి తోరణాలతో ఇంటి గుమ్మాలు అలంకరిస్తారు. కుటుంబంలోనివారంతా తలంటుకొని, క్రొత్త బట్టలు కట్టుకొని ఎంతో ఆనందంగా ఉంటారు. ఆ రోజు పిండివంటలు చేసుకుంటారు. ముందుగా ఉగాది పచ్చడిని దేవునికి నివేదించి భుజిస్తారు. వేపపూవు, లేతమామిడికాయల ముక్కలు, క్రొత్త చింతపండు, క్రొత్త

బెల్లం, జీలకర్ర, పటిక బెల్లంతో ఉగాది పచ్చడిని చేస్తారు. కొన్ని చోట్ల గసగసాలు, పప్పులు కూడా కలపడం పరిపాటి. ఆరోగ్యరీత్యా ఈ పచ్చడి చాలా మంచిది.

మధ్యాహ్నం 'పంచాంగ శ్రవణం' జరుగుతుంది. పంచాంగ శ్రవణం వినడం వల్ల తిథివలన సంపద, వారంవలన ఆయుస్సు, నక్షత్రం వలన పాపపరిహారం, యోగంవలన వ్యాధి నివృత్తి ,



కరణంవలన కార్యానుకూలం కలుగుతుంది. ఈ పంచాంగ శ్రవణంవల్ల సంవత్సరంలో రానున్న గోచార ఫలం, వర్షస్థితి, పంటలు మొదలైన విశేషాలు తెలుస్తాయి. అంతేకాకుండా భూదాన, గోదాన, స్వర్ణదాన, కన్యాదానాలవల్ల కలిగే ఫలితం పంచాంగ శ్రవణంవల్ల కలుగుతుందని పెద్దలు చెపుతారు. వసంత నవరాత్రులు ఉగాది నాడే ప్రారంభమవుతాయి.

ఉగాది పండుగ నాడు షడ్రుచులతో, పిండి వంటలతో విందు చేసుకొంటాము. బంధు, మిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతాము. పండుగ నాటి సాయంకాలంలో సాహిత్యగోష్ఠులు, కవి సమ్మేళనాలు, సంగీత కార్యక్రమాలు, హరికథలు, బుర్ర కథలు, మొదలైన వినోద కార్యక్రమాలు జరుగుతాయి. ఇలాంటి ఉగాది పండుగ ఐకమత్యానికి ప్రతీక. ఆ రోజు బీదసాదలనే భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఉల్లాసంగా, ఆనందంగా ఈ పండుగను జరుపుకొంటారు. భాషేతరులు కూడా ఉగాదిని ఆచరిస్తారు.

ఉగాది తెలుగువాళ్ళకు కొత్త సంవత్సరం కాబట్టి, ఆ రోజు సుఖ సంతోషాలతో గడిపితే ఆ సంవత్సరమంతా ఆనందంగా జీవితం గడుపుతారన్న విశ్వాసం ఉంది. ఉగాది పండుగ రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. ఉగాది తెలుగువారి తరతరాల సంప్రదాయానికి నిదర్శనమైన పండుగ.

**1. కొత్త పదాలు :**

అలంకరణ; ఐకమత్యం; కరణం; కలియుగం; కవి సమ్మేళనం; కృతయుగం; గుమ్మం; తిథి; తోరణం; త్రేతాయుగం; ద్వాపరయుగం; నవరాత్రులు; నక్షత్రం; నాగరికత; నివేదించు; పర్వము; పరిపాటి; పునాది; ప్రతీక; బీదసాద; బుర్రకథ; యోగం; శుభాకాంక్షలు; శ్రవణం; షడ్రుచులు; సాహిత్యగోష్ఠి; సంస్కృతి; హరికథ.

**2. అర్థాలు :**

పబ్బం=పండుగ; జయంతి=పుట్టిన రోజు; గుమ్మాలు=ద్వారబంధాలు; నివేదించడం= అర్పించడం; షడ్రుచులు=ఆరు రుచులు (తీపి, చేదు, వగరు, పులుపు, కారం, ఉప్పు); గోష్ఠులు=సభలు; సమ్మేళనం=కలయిక; ఐకమత్యం=స్నేహంగా ఉండటం; విశ్వాసం=నమ్మకం; ప్రతీక=గుర్తు; స్వర్ణం=బంగారం.

**3. నానార్థాలు :**

| | | |
|---|---|---|
| యుగం | = | జంట, కాలప్రమాణం |
| దానం | = | వితరణ, రక్షణ |
| ధర్మం | = | పుణ్యం, స్వభావం, న్యాయం |
| సుఖం | = | సంతోషం, స్వర్గం, ఆరోగ్యం, ఆనందం |
| యోగం | = | ధ్యానం, ఉపాయం, అదృష్టం, భక్తి |
| పర్వం | = | పండుగ, కణుపు, మహాభారత భాగం |

**4. పర్యాయ పదాలు :**

| | | |
|---|---|---|
| స్నేహం | = | నెయ్యం, చెలిమి, మైత్రి, సఖ్యం |
| బంగారం | = | సువర్ణం, స్వర్ణం, కాంచనం, హేమం |
| పండుగ | = | పబ్బం, ఉత్సవం, పర్వం |
| నక్షత్రం | = | చుక్క, బొట్టు, బిందువు, అందమైనది |

**5. ప్రకృతి - వికృతులు**

| | | |
|---|---|---|
| పర్వం | – | పబ్బం |
| ధర్మము | – | దమ్మము |
| స్నానము | – | తానము |
| పౌర్ణమి | – | పున్నమి |
| స్నేహం | – | నెయ్యం |

**6. వ్యతిరేక పదాలు :**

| | | |
|---|---|---|
| జయంతి | × | వర్ధంతి |
| స్మరించు | × | విస్మరించు |

©KTBS NOT TO BE REPUBLISHED

| | | |
|---|---|---|
| ప్రారంభం | × | ముగింపు |
| ఐకమత్యం | × | అనైకమత్యం |
| నాగరికత | × | అనాగరికత |

**7. సంధులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| సంవత్సర | + | ఆది | = | సంవత్సరాది | (సవర్ణదీర్ఘసంధి) |
| కార్య | + | అనుకూలం | = | కార్యానుకూలం | (సవర్ణదీర్ఘసంధి) |
| శుభ | + | ఆకాంక్షలు | = | శుభాకాంక్షలు | (సవర్ణదీర్ఘసంధి) |
| విధాలు | + | ఐన | = | విధాలైన | (ఉకారసంధి) |
| ప్రారంభము | + | ఐన | = | ప్రారంభమైన | (ఉకారసంధి) |
| సంవత్సరము | + | అంతా | = | సంవత్సరమంతా | (ఉకారసంధి) |

**8. సమాసాలు :**

1. మహాపురుషులు : గొప్పవారైన పురుషులు (విశేషణపూర్వపద కర్మధారయ సమాసం)
2. శుభ ఫలితం : శుభమైన ఫలితం (విశేషణపూర్వపద కర్మధారయ సమాసం)
3. షడ్రుచులు : ఆరు రుచులు (ద్విగు సమాసం)
4. పంచాంగం : అయిదు అంగాలు (ద్విగు సమాసం)
5. పంచాంగ శ్రవణం : పంచాంగం యొక్క శ్రవణం (షష్ఠీ తత్పురుష సమాసం)

**9. కింది ప్రశ్నలకు ఒకటి / రెండు వాక్యాల్లో జవాబు రాయండి :**

1. పండుగలు దేన్ని గురించి తెలుపుతాయి ?
2. పండుగలు ఎన్ని విధాలు ? అవి ఏవి ?
3. యుగాలు ఎన్ని ? అవి ఏవి ?
4. తెలుగు నెలల్లో మొదటి నెల ఏది ?
5. వసంత నవరాత్రులు ఎప్పుడు ప్రారంభమౌతాయి ?

**10. కింది ప్రశ్నలకు వివరంగా జవాబు రాయండి :**

1. ఉగాది పచ్చడి ప్రాశస్త్యాన్ని తెల్పండి ?
2. 'పంచాంగ శ్రవణం' గురించి రాయండి ?
3. ఉగాది పండుగను ఎలా జరుపుకొంటారు ?

©KTBS NOT TO BE REPUBLISHED

# ౮. తుంగభద్రానది

W7H7M1

[భారతదేశంలోని నదులను, వాటి ప్రయోజనాలను విద్యార్థులకు పరిచయం చేసే నేపథ్యంలో 'తుంగభద్రానది' అనే సంభాషణా పూర్వకమైన ఈ పాఠాన్ని కన్నడ విషయ విశ్వకోశ, అంతర్జాలం ఆధారంగా రాయడం జరిగింది. రచయిత్రి శ్రీమతి జి. శశికళగారు కె.జి.ఎఫ్. ప్రథమ శ్రేణి కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసి వృత్తినుండి నివృత్తులైనారు.

ఈ పాఠంలో తుంగభద్రానది, దాని ఆనకట్టలు, వ్యావసాయిక ప్రయోజనాలు; విద్యుదుత్పాదన; మొదలైనవి వివరింపబడ్డాయి.]

+++

(లోపల్నుండి పరిగెత్తుకొస్తున్న మనోజ్‌ను చూసి అతని తాతయ్య)

తాతయ్య :– రేయ్ మనోజ్! ఏమిటా ఉరుకులు, పరుగులు, జాగ్రత్త, పడేవ్, ఇంతకీ ఎక్కడికాపరుగు ?

మనోజ్ :– (వగరుస్తూ) తాతయ్యా ! తాతయ్యా ! మరేమో మనం ఈ దసరా సెలవులకు హోస్పేటకు వెళ్తున్నామట. అమ్మ చెప్పింది. ఈ విషయం నా ఫ్రెండ్ సుమంత్‌కు చెప్పొస్తా.

తాతయ్య :– ఓ ! అదా నీ ఉత్సాహానికి కారణం. నీ ఫ్రెండ్ ఎక్కడికీ పారిపోడులే. ముందు నువ్విటొచ్చి కూర్చో.

మనోజ్ :– (విసుగ్గా మొహంపెట్టి తాతయ్యదగ్గరికివచ్చి) ఏంటి తాతయ్యా ?

తాతయ్య :– కిందటిసారి సెలవులకు మనం ఎక్కడికి వెళ్ళాం ?

మనోజ్ :– చెన్నై

తాతయ్య :– ముందు కూర్చోవోయ్. (మనోజ్ కూర్చుంటాడు) చెన్నైలో ఉన్న వారం రోజులు మనం ఏం చూశాం ?

మనోజ్ :– (ఉత్సాహంగా) ఎంచక్కా బీచ్, అడయార్, జూ, ఇంకా బోల్డన్ని చూశాం.

తాతయ్య :– మరి ఇప్పుడు మనం చూడబోయే హోస్పేట్‌లో ఏమున్నాయో తెల్సుకోవాలని లేదా ?

మనోజ్ :– నీకు తెల్సా తాతయ్యా ! నువ్వు హోస్పేట్ చూశావా ?

తాతయ్య :– నీ మతి మరుపుమండా ! బాబాయ్‌కి చిత్రదుర్గనుండి హోస్పేటకు బదిలీ అయినపుడు వెళ్ళొచ్చాను కదరా !

మనోజ్ :– ఔనౌను, మర్చిపోయా ! ఆ ఊరు ఎక్కడుంది ? నువ్వక్కడ ఏమేం చూశావ్ ?

©KTBS NOT TO BE REPUBLISHED

తాతయ్య :– 'హొసపేట' కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి జిల్లాలో తుంగభద్రానదీ తీరాన ఉంది. ఈ నదిపై ఆనకట్ట కట్టినపుడు కొత్తగా ఏర్పడిన ఊరు కాబట్టి దీనికి 'హొసపేట' అనే పేరువచ్చింది. కన్నడ భాషలో 'హొస' అంటే 'కొత్త' అని అర్థం. 'హొసపేట' అంటే కొత్తఊరు/ పేట అని అర్థం.

మనోజ్ :– అంటే తుంగభద్రానది హోస్పేట దగ్గరలో ఉందన్న మాట.

తాతయ్య :– తుంగభద్రానది ఒడ్డున హోస్పేటఉంది. ఇక్కడ ఈ నదికి ఆనకట్ట కూడా కట్టారు. స్నానానికి గంగానది నీరు ఎంత శ్రేష్ఠమో ఈ నది నీరు తాగడానికి అంత శ్రేష్ఠం. అందుకే 'గంగాస్నానం, తుంగాపానం' అనే నానుడి పుట్టింది.

మనోజ్ :– అసలు ఈ నది ఎక్కడ పుట్టింది ? ఎక్కడెక్కడ ప్రవహిస్తుంది ?

తాతయ్య :– నిజానికి తుంగభద్రానది ఒక్కటికాదు. ఇది తుంగ–భద్రా అనే రెండు నదుల కలయిక. ఇది కర్ణాటక మధ్యభాగంలో ఈశాన్యాభిముఖంగా ప్రవహించే పెద్ద నది. పడమటికనుమలలోని వరాహపర్వతంపై పుట్టిన ఈ రెండు నదులు కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ పట్టణానికి ఈశాన్యంలో 16కి.మీ, దూరంలో నదిగా ప్రవహిస్తుంది.

@ NCERT NOT TO BE REPUBLISHED



మనోజ్ :– ఈ నది కర్ణాటక రాష్ట్రంలో ఎక్కడెక్కడ ప్రవహిస్తుంది ?

తాతయ్య :– తుంగభద్రానది కర్ణాటకలోని శివమొగ్గ; ధార్వాడ; రాయచూరు; చిత్రదుర్గ; బళ్ళారి జిల్లాలలో ప్రవహిస్తూ లక్షలాదిఎకరాల పంటభూములను సస్యశ్యామలం చేస్తోంది.

మనోజ్ :– మరి ఇది ఆంధ్రరాష్ట్రంలో ఎక్కడ ప్రవేశిస్తుంది ?

తాతయ్య :– బళ్ళారి జిల్లా సరిహద్దునుండి పొరుగు రాష్ట్రమైన ఆంధ్రలోని కర్నూలు జిల్లాలో ఉన్న ఆలంపూర్ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ఇక్కడ ఈ నది చిత్రదుర్గ, బళ్ళారి జిల్లాలకు, ఆంధ్రరాష్ట్రానికి సరిహద్దు రేఖవలె పారుతుంది.

మనోజ్ :– తాతయ్యా ! నదులకు ఉపనదులుంటాయని చదువుకున్నాం. మరి తుంగభద్రానదికి కూడా ఉపనదులు ఉన్నాయా ?

తాతయ్య :– ఉన్నాయి. వాటిలో కుముద్వతి; వరదా; హిరేహళ్ళ; మస్కినాలా; హగరి; చిక్కహగరి అనేవి ప్రసిద్ధమైనవి. వీటిలో హగరి పెద్దది.

మనోజ్ :– ఈ నదికి హొస్పేటలోని ఆనకట్టే కాక వేరే ఏవైనా ఉన్నాయా ?

తాతయ్య :– ఇప్పుడు మనం చూడబోతున్నది కొత్తగా కట్టినది. ఇదేకాక అక్కడక్కడా అనేకం కట్టారు. అంతేకాక విజయనగరరాజుల కాలంలో తొమ్మిది ఆనకట్టలు కట్టినట్టుగా తెలుస్తోంది.

మనోజ్ :– ఆ కాలంలో ఆనకట్టలు ఎలా కట్టేవారు ?

తాతయ్య :– పెద్ద, పెద్ద బండలను పేర్చి చిన్న అడ్డగోడలవలె కట్టినవి. వీటిని శ్రీకృష్ణ దేవరాయల దండనాయకుడైన 'ముద్ద' అనే ఆయన కట్టించాడని ప్రతీతి. ఇవి చాలామటుకు తుంగభద్రా జలాశయాలలో మునిగిపోయాయి. ఈ ఆనకట్టలు, జలాశయ నిర్మాణాలనే నీటిపారుదల పథకాలు అంటారు.

మనోజ్ :– ఈ నిర్మాణాల వలన ప్రయోజనాలు ఏమిటి ?

తాతయ్య :– అధికవర్షపాతం కలిగినపుడు, వరదలు, ఉప్పెనలు వచ్చి నదులలోని నీరు సముద్రం పాలయి, వ్యర్థం అవుతుంది. అలాకాకుండా ఈ ఆనకట్టల నిర్మాణం ద్వారా నీటిని నిల్వచేసి, వ్యవసాయానికి, త్రాగడానికి మొదలైన అనేక ప్రయోజనాలను పొందవచ్చును. హొస్పేటలోని ఆనకట్టవలన శివమొగ్గ, రాయచూరు, చిత్రదుర్గ, బళ్ళారి జిల్లాలతో పాటు ఆంధ్రదేశంలో కూడా లక్షలాది ఎకరాల భూములు సాగుచేయబడుతోంది.

మనోజ్ :– ఆనకట్టలనుండి భూములకు నీటి సరఫరా ఎలా జరుగుతుంది ?

© KTBS NOT TO BE REPUBLISHED

తాతయ్య :– ఆనకట్టలనుండి పంటకాలువలను త్రవ్వి పంట భూములకు నీటిని సరఫరా చేయడం జరుగుతుంది. బళ్ళారి జిల్లాలోని 'మాన్వి' అనే ఊరికి ఆగ్నేయంలో 'రాజులబండ' అనే ఆనకట్ట ఉంది. 1947లో హైదరాబాద్ ప్రభుత్వం దీనిని ప్రారంభించింది. కర్ణాటకాంధ్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 1962లో పూర్తయింది.

మనోజ్ :– ఇన్ని ఆనకట్టలు ఉన్నా వరదలు, ఉప్పెనలు వచ్చి ఊళ్ళకు ఊళ్ళే మునిగి పోతున్నాయిగా ?

తాతయ్య :– అవును. నదీమ తల్లి అనుగ్రహిస్తే ప్రాణంపోస్తుంది. ఆగ్రహిస్తే ప్రాణం తీస్తుంది. ప్రకృతిలో ఒకటయిన నది ప్రకృతికి హాని కలిగినపుడు విపత్తులకు కారణమౌతుంది.

మనోజ్ :– ప్రకృతికి హాని కలగడం అంటే ఏమిటి ?

తాతయ్య :– పంచభూతాలతో కూడినది ప్రకృతి. ప్రకృతిలోని ఐదు అంశాలు మనుష్యుల వలన దుర్వినియోగమైనపుడు ప్రకృతికి హాని కలుగుతుంది. కాబట్టి మనం ప్రకృతిని రక్షించుకొంటే అది మనల్ని రక్షిస్తుంది. అంటేమనల్ని మనం రక్షించుకొంటామన్న మాట

మనోజ్ :– తుంగభద్రానది ఆనకట్టల వలన వ్యవసాయరంగాభివృద్ధే కాక ఇతర ప్రయోజనాలేవైనా ఉన్నాయా ?

తాతయ్య :– ఉన్నాయి. తుంగభద్రానది పథకం బహుళోద్దేశపథకం. నీటిపారుదలే కాక జలయానం; పట్టణాలకు తాగునీటి సరఫరా; ఇంకా విహారానుకూలం మొదలైన ప్రయోజనాలు ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే జలవిద్యుదుత్పాదన చేయడం ఒక్కటే ఒక ఎత్తు.

మనోజ్ :– జలవిద్యుదుత్పాదన అంటే ఏమిటి ?

తాతయ్య :– జలవిద్యుదుత్పాదన అంటే నీటినుండి విద్యుత్తును తీయడం. ఒక దేశ ఆర్థికాభివృద్ధి ఆ దేశవనరులపై ఆధారపడి ఉంటుంది. ఆ వనరులలో శక్తి ప్రధానమైంది. విజ్ఞానశాస్త్రాభివృద్ధితో మనిషి అనేక విషయాలను కనుగొంటున్నాడు. అందులో ఈ జలవిద్యుత్ ఉత్పత్తి ఒకటి. జలవిద్యుత్ ఉత్పత్తి అంటే నీటినుండి నిప్పును పుట్టించడమన్నమాట.

మనోజ్ :– అదెలాగా ?

తాతయ్య :– ప్రకృతి మనకు ప్రసాదించిన సహజవనరులైన బొగ్గు, పెట్రోలియం నిక్షేపాలు కొన్ని సంవత్సరాలలో క్షీణించే అవకాశంవుంది. కాని జలవిద్యుచ్ఛక్తిమాత్రం ఎన్నటికీ తరగని శక్తివనరు. నదులకు ఆనకట్టలు కట్టి జలాశయాలు ఏర్పరచి, జలవిద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తారు.

NOT TO BE REPUBLISHED ©KTBS

మనోజ్ :– తుంగభద్రా ఆనకట్టలవలన కూడా జలవిద్యుత్ ఉత్పత్తి జరుగుతుందా ?

తాతయ్య :– జరుగుతుంది. తుంగభద్రా ఆనకట్టలో ఒక్కొక్క ఒడ్డులోను ఒక్కొక్క విద్యుత్ ఉత్పత్తి కేంద్రముంది. రాయచూర్‌లో నిర్మించిన కాలువపై మాత్రం ఐదు ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలనుండి మొత్తం 1,72,500 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది.

మనోజ్ :– తాతయ్యా ! ఒక్క సందేహం

తాతయ్య :– ఏంటది ?

మనోజ్ :– విద్యుత్ అంటే అగ్గి కదా ! నీటితో ఆరి పోయేది కదా. మరి అది నీటినుండి పుట్టడమేంటి ?

తాతయ్య :– చాలా మంచి ప్రశ్న. వర్షాకాలంలో మెరుపులు మెరవడం మనకు తెల్సుకదా ! ఆ మెరుపులో విద్యుత్తు ఉంటుంది. కావ్యాల్లో కూడా మెరుపుని విద్యుల్లత అన్నారు. ఇది సృష్టి విచిత్రం. పరస్పర వైరుధ్యమయమే ఈ సృష్టి.

మనోజ్ :– తుంగభద్రానది ఒడ్డున హొస్పేట కాక వేరే ఊళ్ళేవైనా ఉన్నాయా ?

తాతయ్య :– వెరీగుడ్ ! చాలా మంచి ప్రశ్న. అసలు సంస్కృతీ నాగరికతలు వృద్ధి చెందేవి నదీతీరాల్లోనే కదా ! నువ్వు సింధూనాగరికతను గురించి చదువుకున్నావుకదా ! అనేక పట్టణాలు, పుణ్యక్షేత్రాలు ఈ నదీతీరాన నెలకొని ఉన్నాయి.

మనోజ్ :– ఇప్పుడున్నవాటి మాట సరే ! పూర్వకాలంలో కూడా నగరాలు వగైరాలు ఉండేవా ?



తాతయ్య :– పురాతన కాలం నుండి కూడా ఈ నది జనోపకారి అయినందువల్ల ఈ నదీతీరం సంస్కృతీనాగరికతలకు పుట్టినిల్లు. ఈ తీరంలోని నిట్టూరు, హంపసాగర అనే స్థలాలు ఇతిహాసకాలానికి పూర్వానివి. ఇతిహాసకాలంలో కూడా ఈ నది రాజకీయ–భౌగోళిక వ్యవస్థలో ప్రముఖపాత్ర వహించింది. కొన్ని రాజ్యాలకు సరిహద్దు రేఖగా విలసిల్లింది. ఈ నదీతీరంలోనే హంపి, కంప్లి, మొదలైన కోటలు నిర్మింపబడ్డాయి. అంతే కాదు. ఈ నదీతీరాన అనేక దేవాలయాలు వెలసి పవిత్రక్షేత్రాలుగా ప్రసిద్ధి పొందాయి. ఆంధ్రదేశంలోని కర్నూలు జిల్లాలో నెలకొని ఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం ఈ నదీతీరంలోనిదే

మనోజ్ :– ఇంతటి గొప్పచరిత్ర గల ఈ నది ఎప్పటిది తాతయ్యా !

తాతయ్య :– కచ్చితంగా చెప్పలేం కాని అతి ప్రాచీనమైంది అనడం నిస్సంశయం. ఎందుకంటే రామాయణ, భారత, భాగవతాలలో, మత్స్య, వరాహ, బ్రహ్మాండ పురాణాలలో ఈ నది యొక్క ప్రస్తావన ఉంది. బ్రహ్మాండ పురాణంలో అయితే దీనిని గురించిన కథే ఉంది.

మనోజ్ :– ఆ కథేంటో చెప్పవా ?

తాతయ్య :– ఇప్పటికే పొద్దు పోయింది. మరెప్పుడైన చెప్తాలే.

మనోజ్ :– మరి నేను మా ఫ్రెండింటికి వెళ్ళిరానా ?

తాతయ్య :– ఈ చీకట్లో ఏం వెళ్తావులేగాని భోంచేసి పడుకో ! ఎలాగూ రేపు ఉదయం స్కూల్ బస్‌లో కలుస్తారుగా !.

NOT TO BE REPUBLISHED
©KTBS

## 1. **కొత్తపదాలు**:

ఆధ్వర్యం; అభిముఖం; ఇతిహాసం; ఉత్పాదన; కనుమలు; కిలోవాట్లు; దుర్వినియోగం; బహుళోద్దేశ పథకం; విద్యుల్లత; వైరుధ్యమయం.

## 2. **అర్థాలు** :

శ్రేష్ఠం=ఉత్తమం; సస్యం=పైరు; విపత్తు=ఆపద; అంశాలు=భాగాలు;దుర్వినియోగం=చెడు ఉపయోగం; బహుళ=అనేక; సంస్కృతి=సంస్కరింపబడినది; నాగరికత=నగర సంబంధమైనది; విద్యుల్లత=మెరుపు తీగ; భౌగోళం=భూగోళ సంబంధమైనది, వైరుధ్యం=విరోధం.

3. **పర్యాయపదాలు** :

నది = స్రవంతి; శైవలిని; కూలంకష; ధుని

సముద్రం = అబ్ధి; కడలి; ఉదధి; జలధి; రత్నాకరం.

4. **ప్రకృతి - వికృతులు** :

భాష – బాస

అగ్ని – అగ్గి

సస్యం – సస్సెం

శక్తి – సత్తి

భోజనం – బోనం.

5. **వ్యతిరేక పదాలు** :

ప్రాచీనం × ఆధునికం/ఆర్వాచీనం

పురాతనం × నవీనం

సంశయం × నిస్సంశయం

మునగడం × తేలడం

వినియోగం × దుర్వినియోగం

6. **సంధులు** :

**సవర్ణదీర్ఘ సంధులు** :

ఈశాన్య + అభిముఖం = ఈశాన్యాభిముఖం

దేవ + ఆలయం = దేవాలయం

శాస్త్ర + అభివృద్ధి = శాస్త్రాభివృద్ధి

చారిత్ర + ఆత్మకం = చారిత్రాత్మకం

**ఉకారసంధులు** :

ఎత్తు + అయితే = ఎత్తయితే

పుట్టించడము + అన్నమాట = పుట్టించడమన్నమాట

@KTBS NOT TO BE REPUBLISHED

7. **సమాసాలు**

**విశేషణ పూర్వపద కర్మధారయ సమాసాలు**

1. పెద్దబండ – పెద్దదైన బండ
2. సహజ వనరులు – సహజమైన వనరులు
3. పవిత్రక్షేత్రాలు – పవిత్రమైన క్షేత్రాలు
4. చారిత్రాత్మక రాజధానులు – చారిత్రాత్మకమైన రాజధానులు

**ద్విగుసమాసం** :- తొమ్మిది ఆనకట్టలు–తొమ్మిది అయిన ఆనకట్టలు

**షష్ఠీ తత్పురుష సమాసాలు**:- నీటి పారుదల పథకాలు–నీటి పారుదల యొక్క పథకాలు

**విజ్ఞాన శాస్త్రాభివృద్ధి** :- విజ్ఞాన శాస్త్రం యొక్క అభివృద్ధి

**ద్వంద్వసమాసాలు**:-

సంస్కృతీనాగరకతలు – సంస్కృతి మరియు నాగరకత

భారత భాగవతాలు – భారతం మరియు భాగవతం

8. **విశేషాంశాలు**:

ఈశాన్యం :– తూర్పు, ఉత్తర దిక్కుల మధ్యనున్న మూల

ఆగ్నేయం :– తూర్పు, దక్షిణ దిక్కుల నడుమనున్న మూల

పంచభూతాలు :– ఐదు భూతాలు

1. భూమి 2. ఆకాశం 3. నీరు 4. గాలి 5. అగ్ని

9. **తెలుసుకొందాం** :

**పురాణం** :

1. వేదం కంటె పురాతనమైనది.
2. సృష్టి; ప్రతిసృష్టి; వంశం; మన్వంతరం; వంశానుచరితం అనే ఐదు లక్షణాలు గలది.

**ఇతిహాసం** :

ఇలా జరిగింది అనే పూర్వరాజుల చరిత్ర కలది – భారతం మొదలైనవి.

@KTBS NOT TO BE REPUBLISHED

## 10. **చిన్నప్రశ్నలు :**

1. 'హొస్పేట' ఎక్కడుంది ?
2. 'తుంగ-భద్రా' నదుల పుట్టుక ఎక్కడ ?
3. 'తుంగ-భద్రా' నదులు ఎక్కడ కలుస్తాయి ?
4. 'రాజుల బండ' అనే ఆనకట్ట ఎక్కడ ఉంది ?
5. సహజ వనరులను రెండింటిని తెలపండి ?
6. సంస్కృతీ-నాగరకతలు ఎక్కడ పెంపొందుతాయి ?
7. తుంగభద్రా నదీ ప్రవహించే రాష్ట్రాలను రెండింటిని తెలపండి ?
8. తుంగభద్రా నదికి ఆనకట్టలు కట్టిన దండనాయకుడెవరు ? అతడు ఏ రాజు కాలపువాడు ?
9. తుంగభద్రానది ప్రస్తావన ఏ గ్రంథాలలో ఉంది ?
10. ఆంధ్రదేశంలో తుంగభద్రానదీతీరాన గల పుణ్యక్షేత్రం ఏది ?
11. తుంగభద్రానది ఆంధ్రదేశంలోనికి ఎక్కడ ప్రవేశిస్తుంది ? ఏ నదిలో కలుస్తుంది ?
12. కిలోవాట్ అంటే ఏమి ?

## 11. **పెద్ద ప్రశ్నలు :**

1. తుంగభద్రానది కర్ణాటక రాష్ట్రంలో ఏయే జిల్లాలలో ప్రవహిస్తుంది ?
2. తుంగభద్రానదిపై కట్టిన ఆనకట్టలను గురించి రాయండి ?
3. రాజులబండ ఆనకట్టను గురించి తెలపండి ?
4. తుంగభద్రానది యొక్క జలవిద్యుత్ కేంద్రాలను గురించి వివరించండి ?
5. తుంగభద్రానది బహుళోద్దేశ పథకాన్ని గురించి తెలపండి ?
6. తుంగభద్రానదీ తీరంలోని ప్రాచీన స్థలాలను తెలపండి ?
7. తుంగభద్రానది యొక్క ఉపనదులను తెలపండి ?

@KTBS NOT TO BE REPUBLISHED

# ౯. కిత్తూరురాణి చెన్నమ్మ

S3Z4B1

[“జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి” అన్నది ఆర్యోక్తి. తల్లి, తల్లినేల, స్వర్గానికంటే గొప్పదని దీని అర్థం. అటువంటి జన్మభూమి రక్షణకై అసువులు బాసిన వీరవనిత కిత్తూరురాణి చెన్నమ్మ జీవితాంశాలతో కూడుకొన్నది ఈ పాఠ్యభాగం. కన్నడ విషయ విశ్వకోశ, అంతర్జాలం ఈ పాఠానికి ఆధారం. రచయిత్రి శ్రీమతి జి. శశికళగారు కె.జి.ఎఫ్. ప్రథమ శ్రేణి కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసి వృత్తినుండి నివృత్తులైనారు.

స్వాతంత్ర్యం యొక్క విలువ, దానిని రక్షించుకోవల్సిన బాధ్యత, ఆ ప్రయత్నంలో ఎదురయ్యే ఒడిదుడుకులను, ఎదుర్కొగల మనోనిబ్బరాన్ని అలవర్చుకోవల్సిన అవసరంతోపాటు పరిస్థితుల ప్రభావం అబలలను ఏవిధంగా సబలలను చేస్తుందో తెలిపేపాఠ్యభాగం ఇది.]

పరాయి పాలనలో పాయసాన్నముల కంటే స్వాతంత్ర్యంలో గంజిమేలు. వ్యాపారనెపంతో భారతదేశానికి వచ్చి క్రమంగా రాజకీయాధిపత్యాన్ని చేజిక్కించుకొంటున్న ఆంగ్లేయుల అనవసరపుజోక్యాన్ని ఎదిరించి, తమ సంస్థానపు స్వాతంత్ర్యాన్ని రక్షించుకొనే ప్రయత్నంలో, అసువులు బాసిన చెన్నమ్మ జీవితం స్వాతంత్ర్య పరిరక్షణ, ఆత్మాభిమానం, మొదలయిన జీవితపు విలువలకు అద్దం పడ్తుంది.

ఆమె ప్రథమ స్వాతంత్ర్యపోరాట శంఖాన్ని పూరించిన ధీరవనిత. మహాశక్తిగా రవి అస్తమించని సామ్రాజ్యమని ప్రసిద్ధికెక్కిన ఆంగ్ల సామ్రాజ్యాన్ని గడగడలాడించిన సాహసి. ఆంగ్లేయుల్ని దేశం నుండి తరిమి కొట్టడంలో సఫలీ కృతురాలు కాకపోయి ఉండవచ్చునుగాక. కాని అందుకోసం ఆమె చేసిన ప్రయత్నం తరువాతి తరాలవారికి స్ఫూర్తిదాయకం.

కర్నాటక రాష్ట్రంలోని బెళగావిలో కుగ్రామమైన 'కాకతి'లో దేసాయిలయింట 1778లో చెన్నమ్మ జన్మించింది. అంటే ఝాన్సీరాణి లక్ష్మీబాయి కంటే దాదాపు 57 సంవత్సరాలకు పూర్వం. (ఝాన్సీలక్ష్మీబాయి జననం 1835, నవంబర్ 19) ఈమె తండ్రి కాకతిదేసాయి. బాల్యం నుండే చెన్నమ్మ విలువిద్య, కత్తియుద్ధం, గుర్రపుస్వారి మొదలయిన యుద్ధ విద్యలందు నైపుణ్యం సంపాదించింది. ఆ గ్రామంలో ధైర్యసాహసాలకు ఆమె పెట్టింది పేరు.

చెన్నమ్మకు తన పదిహేనవయేట కిత్తూరుదొర అయిన మల్లసర్జునితో వివాహం జరిగింది. చెన్నమ్మ ఇతనికి రెండవ భార్య. రుద్రమ్మ ఇతని పట్టపురాణి. రుద్రమ్మ కుమారుడు శివలింగరుద్రసర్జ. చెన్నమ్మకు కొడుకు జన్మించాడుగాని బాల్యంలోనే మృతి చెందాడు. పుత్రశోకంతో తల్లడిల్లుతున్న భార్య మనస్సును మల్లసర్జ ప్రజాసంక్షేమకార్యక్రమాల వైపు మళ్ళించాడు. క్రమంగా ప్రజల హృదయాలలో స్థానం సంపాదించుకొన్నాడు. వారి కష్టసుఖాలలో భాగియై కిత్తూరు సంస్థాన ప్రజల మన్ననలందుకొన్నాడు.

@KTBS NOT TO BE REPUBLISHED

మరాఠా రాజులయిన పేష్వాలు కిత్తూరుపై దాడి చేశారు. ఆదాడిలో ఓడిపోయిన మల్లసర్జనున్ని పేష్వాలు బంధించారు. పేష్వాలు ఖైదీగా ఉన్న కిత్తూరుదొర తన అవసానదశలో విముక్తుడయ్యాడు. కాని అనతికాలంలోనే శివరుద్రసర్జ కిత్తూరు సంస్థానాధిపతి అయ్యాడు. ఇతనికి సంతానం లేకపోవడంవల్ల శివలింగప్ప అనే బాలున్ని దత్తత తీసుకొన్నాడు. ఎనిమిది సంవత్సరాలు మాత్రమే రాజ్యపాలన గావించిన శివరుద్ర సర్జ క్షయరోగ పీడితుడై మరణించాడు. సంస్థానంలోని పెద్దలు, మరియు పట్టపురాణి రుద్రమ ప్రోద్బలంతో చెన్నమ్మ రాజప్రతినిధిగా పాలనా పగ్గాలను చేపట్టింది.

వ్యాపార నెపంతో భారతదేశానికి ఏకైవచ్చి మేకై కూర్చున్న ఆంగ్లేయులు, అప్పటికే క్రమంగా దేశంలోని సంస్థానాలను ఒక్కొక్కటిగా తమ ఆధిపత్యంలోనికి తెచ్చుకోవడం ప్రారంభించారు. కిత్తూరు సంస్థానంపై కన్నుపడింది. మగదిక్కులేని ఈ సంస్థానాన్ని కైవసం చేసుకోవడం సులభమని భావించారు. అందుకు వారికి దొరికిన నెపం శివరుద్రసర్జ దత్తుస్వీకారం.

అప్పటి ధార్వాడ కలెక్టరు, రాజప్రతినిధి కూడ అయిన థ్యాకరే దక్కన్ కమిషనర్ అయిన చాప్లిన్‌తో కలిసి కుట్రపన్ని దత్తుస్వీకారం మల్లరుద్ర సర్జనుని కాలంలో జరగలేదనీ, అతని మరణానంతరం జరిగిందనీ అందువల్ల చెల్లదన్నారు. ఈ వర్తమానాన్ని, అప్పటి బొంబాయి ప్రెసిడెన్సీ గవర్నర్ అయిన ఎల్ఫిన్‌స్టన్‌కు చేరవేశాడు. అంతటితో ఆగక తాను చెప్పిపంపేవరకు సంస్థానపు పరిపాలనా బాధ్యతను తన ప్రతినిధులకు అప్పచెప్పవల్సిందని తెలిపి, సంస్థానపు ఖజానాను స్వాధీనపరుచుకో యత్నించాడు. థ్యాకరే యొక్క ఈ ప్రవర్తన చెన్నమ్మకు సహింపరానిదయ్యింది. స్వవిషయాలలో పరాయివాని జోక్యం చెన్నమ్మ (కిత్తూరి సంస్థానపు) ఆత్మాభిమాన్నాన్ని దెబ్బ తీసింది. సంస్థానంలోని ఇతర ప్రముఖులు కూడా దీనిని వ్యతిరేకించారు.

లోక కల్యాణార్థం శివుడు గరళం మ్రింగినట్లు చెన్నమ్మ తన ఆగ్రహావేశాలను తనలోనే అణచుకొని యుద్ధం వలన కలిగే అనర్థాలను, అనవసరపు రక్తపాతాన్ని అరికట్టదలచి మిక్కిలి ఓర్పుతో, దత్తుస్వీకార విషయమై, కలెక్టర్, కమిషనర్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపింది, కాని అది చెవిటివాని ముందు శంఖమూదినట్లయ్యింది.

అదను చూసి థ్యాకరే 23 అక్టోబర్ 1824న సైన్య సమేతుడై కిత్తూరులో అడుగు పెట్టాడు. దూరదృష్టి గల చెన్నమ్మ ముంజాగరూకతతో, యుద్ధసన్నద్ధురాలైంది. కిత్తూరు ప్రజలు, సంస్థానపు సరదారులు, సంగొళ్ళిరాయణ్ణవంటి దేశాభిమానులు, ఆమెకు అండదండలయ్యారు. చెన్నమ్మ కోటతలుపులను బంధించి ఆంగ్ల సైన్యప్రవేశాన్ని అవరోధించింది. ఇరవైనిమిషాలలో కోటతలుపులు తీయకపోతే యుద్ధం తప్పదని హెచ్చరిస్తూ ఆంగ్లేయులు కోటవాకిళ్ళకు ఫిరంగులను గురి పెట్టారు. ఈ బెదరింపులు చెన్నమ్మ ధైర్యాన్ని ఏ మాత్రం సడలించలేకపోయింది.

© KTBS NOT TO BE REPUBLISHED



కిత్తూరు సైన్యం గురుసిద్ధప్పనాయకత్వంలో విదేశీసైన్యాన్ని ఎదుర్కొంది. ఖడ్గధారిణియై అశ్వరూఢయై యుద్ధభూమిలో ప్రవేశించిన చెన్నమ్మ దర్శన మాత్రం చేతనే ఆమె సైన్యంలో వీరావేశం పెల్లుబికింది. చెన్నమ్మ అంగరక్షకుడయిన బాలప్ప తుపాకీగుండుదెబ్బకు థ్యాకరే నేల కూలాడు. అనేకమంది ఆంగ్ల సైనికులు హతులయ్యారు. మరి కొంతమంది బందీలయ్యారు. వారిలో స్టీమ్‌సన్, ఇలియట్ అనువారు ప్రసిద్ధులు. యుద్ధ ఖైదీలలో బాలురు కూడా ఉన్నారు. వారిపట్ల దయతో వ్యవహరించవలసిందిగా చెన్నమ్మ తనవారిని హెచ్చరించింది. ఈ ముట్టడిలో కిత్తూరు కోటపై విజయపతాకం రెపరెపలాడింది.

కిత్తూరు సంస్థానం వంటి చిన్న సంస్థానం చేతిలో పరాజయం పాలయిన సంఘటన ఆంగ్లేయుల అహంకారంపై దెబ్బకొట్టింది. ఓటమివార్త విన్నంతనే చాప్లిన్, కర్నల్ డీకన్లు అతిపెద్ద సైన్యంతో కిత్తూరు చేరుకొన్నారు. బందీల విడుదలకై శతథా ప్రయత్నం చేశారు. ఈ విషయమై చాప్లిన్, చెన్నమ్మల నడుమ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి. యుద్ధ ఖైదీలను విడుదల చేయాలంటే ఆంగ్లేయులు కిత్తూరు సంస్థాన విషయాలలో జోక్యం చేసుకోరాదని, అది స్వతంత్ర్యరాజ్యమని గుర్తించాలని షరతు పెట్టింది. ఈ షరతు ఆంగ్లేయులకు కొరకరానికొయ్య అయ్యింది. ఈ

విషయమై సుమారు నెలరోజులపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగాయి. చెన్నమ్మ తన పట్టుదలను ఏమాత్రం సడలించలేదు. గత్యంతరం లేని ఆంగ్లేయులు యుద్ధ ఖైదీలను విడుదల చేసినట్లయితే యుద్ధం చేయమని ప్రకటించారు. యుద్ధం వలన కలిగే అనర్థాలను అరికట్టదలచిన చెన్నమ్మ బందీలను విముక్తులను చేసింది.

కుటిలరాజనీతి పరులయిన ఆంగ్లేయులు ఆడినమాటను తప్పి, తమ పబ్బం గడవగానే యుద్ధానికి సన్నద్ధమయ్యారు. ఏవిధంగానైనా సరే కిత్తూరు కోటను కబళించాలన్నదే వారి ధ్యేయం. ఉత్తర, ప్రత్యుత్తరాల నెపంతో నెలరోజులు కాలయాపన చేసిన ఆంగ్లేయులు, ఆ వ్యవధిలో, యుద్ధానికి సర్వసన్నాహాలు చేసుకొన్నారు. మదరాసు, ముంబై, సోలాపూర్ మొదలైన ప్రాంతాల నుండి శిక్షణ పొందిన ఫిరంగి, అశ్వపదాతిదళాలను రప్పించుకొన్నారు. కిత్తూరువాసులలో కొందరిని ప్రలోభ పెట్టి లోబరచుకొన్నారు. ఈ విధంగా సర్వవిధాల యుద్ధానికి సంసిద్ధులై, చెన్నమ్మ ఆంగ్ల సామ్రాజ్యానికి విధేయత చూపనిచో రణం తప్పదని తెలిపారు. ఆంగ్లేయుల మనోభావాల్ని క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న చెన్నమ్మ "మేమెన్నడూ యుద్ధాన్ని ఆశించలేదు. మా స్నేహ పూరితభావాలను మీరు వైరిభావాలుగా భావించారు. వేరే మార్గం లేదని" యుక్తియుక్తంగా ధీరోదాత్తపు సమాధానాన్ని పంపింది. దీనితో రెండవమారు యుద్ధం తప్పలేదు. చెన్నమ్మతో పాటు సంస్థానపు ప్రముఖులు కూడా తెల్లవారికి శరణాగతులవడం అవమానకరంగా భావించి విజయమో, వీరస్వర్గమో తేల్చుకోవడానికి నిశ్చయించారు.

ఇరు పక్షాలు సంగ్రామానికి సిద్ధమయ్యాయి. 1824 నవంబర్ 30న పోరు ప్రారంభమైంది. చెన్నమ్మ, ఆమె సైనికులు ఆమెకు అండగా నిల్చిన స్వాతంత్ర్యాభిమానులు, సంగొళ్ళిరాయణ్ణ వంటి దేశభక్తులు ప్రాణాలకు తెగించి పోరాడారు. కాని సుశిక్షితులయిన ఆంగ్లసైన్యం ముందు కిత్తూరు సైన్యం నిలవలేక పోయింది. దానికి తోడు స్థానికవిద్రోహులు మందుగుండు సామగ్రిలో పేడ, బురద కలిపి వెన్నుపోటు పొడిచారు. వీటిలో కిత్తూరు మట్టికోట బీటలు వారసాగింది.

చెన్నమ్మకు అపజయం తప్పదని అవగతమైంది. శత్రువుల చేజిక్కకుండా పారిపోప్రయత్నించింది. తానొకటి తలచిన దైవమొకటి తలచెనన్నట్లుగా ఆమె ప్రయత్నం విఫలమై శత్రువులకు బందీ అయ్యింది. వారు అమెను బైలహొంగలలోని చెరసాలలో బంధించారు. కిత్తూరు కోట పరిరక్షణయే తన జీవిత లక్ష్యంగా భావించిన చెన్నమ్మ అందుకై బందీగా ఉండికూడ తన శాయశక్తులా ప్రయత్నించింది. స్వాతంత్ర్యాభిమానులైన సంగొళ్ళి రాయణ్ణ, బిచ్చుకత్తి చెన్న బసప్ప, గజవీర మొదలయిన తన అనుచరులతో రహస్య మంతనాలు జరిపి వారిని తిరుగుబాటుకు ప్రోత్సహించింది. చివరకు సంగొళ్ళిరాయణ్ణను బ్రిటీషువారు ఉరి తీశారన్న వార్తతో చెన్నమ్మ హతాశురాలయింది.

ఆరు సంవత్సరాలు కారాగారవాసాన్ని అనుభవించి చివరకు చెరలోనే 1830 ఫిబ్రవరి 2వ తేదీన తన యాభై రెండవ యేట కన్నుమూసింది.

NOT TO BE REPUBLISHED ©KTBS

చెన్నమ్మ కిత్తూరు సంస్థాన స్వాతంత్ర్యరక్షణ కోసం సాగించిన పోరాటం ప్రజల నోళ్ళలో, పాటల రూపంలో, కథల రూపంలో అజరామరమైంది.

### 1. కొత్తపదాలు :

అవగతం; అరికట్టు; అజరామరం; అవసానదశ; ఆధిపత్యం; ఓర్పు; క్షుణ్ణంగా; కాలయాపన; కుగ్రామం; కొరకరాని కొయ్య; గత్యంతరం; గరళం; ధీరోదాత్తం; నెపం; నైపుణ్యం; ప్రథమ; పెల్లుబుకు; ప్రోద్బలం; ప్రలోభపెట్టు; బీటలువారు; మంతనాలు; యుక్తియుక్తం; వ్యవధి; విముక్తి; వెన్నుపోటు; శరణాగతులు; శాయశక్తులా; సఫలీకృతం; సంగ్రామం; సడలించు; హతాశులు; హతులు.

### 2. అర్థాలు :

ప్రథమ=మొదటి; ప్రోద్బలం=బలవంతం; ప్రలోభపెట్టు=ఆశచూపు; కబళించు=వశపర్చుకొను; వెన్నుపోటు=మోసం; శతథా=అన్నివిధాల; అజరామరం=శాశ్వతం; అండదండలు=సహాయం; శత్రుభావాలు=విరోధిభావాలు; కాలయాపన=అనవసరపు ఆలస్యం; బీటలు=పగళ్ళు; అవగతం=అర్థం కావడం; అవసానదశ=చివరిరోజులు; సడలించు=వదలుచేయు; ధీరోదాత్తం=గంభీరం; కొరకరానికొయ్య=అసాధ్యం; అనతికాలం=తక్కువకాలం; గత్యంతరం=వేరేదారి; యుక్తియుక్తం=తగినఉపాయం; హతాశురాలు=ఆశలు పోగొట్టుకొన్నది; కుటిలం=మోసం; గరళం=విషం; సన్నద్ధం=సిద్ధం

©KTBS NOT TO BE REPUBLISHED

### 3. నానార్థాలు :

రాజు – చంద్రుడు; ప్రభువు; క్షత్రియుడు; ఇంద్రుడు; దొర.

పక్షం – 15రోజులు; రెక్క; వైపు.

ఉత్తరం – ఒకదిక్కు; లేఖ; జవాబు.

### 4. పర్యాయ పదాలు :

| | | |
|---|---|---|
| రవి | – | సూర్యుడు; దినకరుడు; ఇనుడు; దివాకరుడు; జలజాప్తుడు. |
| తండ్రి | – | జనకుడు; పిత. |
| భార్య | – | గృహిణి; ఇల్లాలు. |
| అధిపతి | – | నాయకుడు; రాజు; దొర; అధికారి. |
| సంవత్సరం | – | వర్షం; ఏడు; అబ్ది. |
| ఓర్పు | – | సహనం; తాల్మి; ఓర్మి; క్షమ. |
| యుద్ధం | – | సమరం; సంగ్రామం; రణం; పోరు. |
| చెరసాల | – | జైలు; కారాగారం; బందిఖానా; కారాగృహం. |
| స్వర్గం | – | నాకము; దేవలోకం; దివి. |
| కత్తి | – | ఖడ్గం; కరవాలం; కృపాణం. |

**5. వ్యతిరేక పదాలు :**

| | | |
|---|---|---|
| స్వాతంత్ర్యం | × | పారతంత్ర్యం |
| విధేయత | × | అవిధేయత |
| వైరం | × | స్నేహం |
| విజయం | × | పరాజయం |
| స్వదేశం | × | విదేశం/పరదేశం |
| సహనం | × | అసహనం |
| అవసరం | × | అనవసరం |
| ఉత్సాహం | × | నిరుత్సాహం |

**6. వ్యుత్పత్త్యర్థాలు:**

పుత్రుడు :– పున్నామనరకం నుండి రక్షించువాడు – కొడుకు

దివంగతుడు :– దివికి ఏగినవాడు – మరణించినవాడు

**7. ప్రకృతి - వికృతులు:**

| | | |
|---|---|---|
| రాజు | – | రేడు |
| పండుగ | – | పబ్బం |
| విద్య | – | విద్దె / విద్దియ |
| యత్నం | – | జతనం |
| యుక్తి | – | ఉత్తి |

**8. సంధులు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉకార సంధులు :– | రాజులు | + | అయిన | = | రాజులయిన |
| | పీడితులు | + | ఐ | = | పీడితులై |
| | వలెను | + | అని | = | వలెనని |
| సవర్ణదీర్ఘ సంధులు :– | అజర | + | అమరం | = | అజరామరం |
| | ఆత్మ | + | అభిమానం | = | ఆత్మాభిమానం |
| | కల్యాణ | + | అర్థం | = | కల్యాణార్థం |
| | వీర | + | ఆవేశం | = | వీరావేశం |

@KTDS NOT TO BE REPUBLISHED

౯. **సమాసాలు** :

ధీరవనిత :– ధీరురాలైన వనిత – విశేషణపూర్వపద కర్మధారయ సమాసం

ఉత్తరప్రత్యుత్తరాలు :– ఉత్తరములు మరియు ప్రత్యుత్తరములు – ద్వంద్వసమాసం

కిత్తూరుదొర :– కిత్తూరుయొక్కదొర – షష్ఠీతత్పురుష సమాసం

ఇరవైనిమిషాలు :– ఇరవై అయిన నిమిషాలు – ద్విగు సమాసం

౧౦. **చిన్నప్రశ్నలు** :

1. కిత్తూరు చెన్నమ్మ జన్మస్థలం ఏది ?
2. చెన్నమ్మ తండ్రి ఎవరు ?
3. చెన్నమ్మ ఎవరిని వివాహం చేసుకొనింది ?
4. మల్లసర్జ ఏ సంస్థానానికి అధిపతి ?
5. మల్లసర్జ పట్టపురాణి ఎవరు ?
6. కిత్తూరు సంస్థానాన్ని ఆంగ్లేయులు ఎన్నిమార్లు ముట్టడించారు ?
7. మల్లసర్జ అనంతరం కిత్తూరు సంస్థానాధిపతి ఎవరు ?
8. థ్యాకరేను ఎవరు చంపారు ?
9. రాణి చెన్నమ్మ అనుచరులు ఎవరు ?
10. రాణి చెన్నమ్మ ఎక్కడ, ఎప్పుడు మరణించింది ?
11. చెన్నమ్మ ఏ రూపంలో అజరామరమైంది ?
12. చెన్నమ్మ జీవితకాలం ఏది ?

౧౧. **పెద్ద ప్రశ్నలు** :

1. చెన్నమ్మ బాల్యాన్ని గురించి రాయండి ?
2. ఆంగ్లేయులపై చెన్నమ్మ సాధించిన విజయాన్ని వివరించండి ?
3. చెన్నమ్మకు ఆంగ్లేయులకు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల సారాంశం తెల్పండి ?
4. కిత్తూరు ఆంగ్లేయుల వశమైన విధం రాయండి ?

©KTBS NOT TO BE REPUBLISHED

# ౧౦. పిల్లి- గ్రద్ద

చిన్నయసూరి -

[శ్రీ పరవస్తు చిన్నయసూరి క్రీ.శ. 1806 వ సంవత్సరంలో తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాకు చెందిన శ్రీ పెరంబదూరులో జన్మించారు. తెలుగు, తమిళం, సంస్కృత భాషలలో పండితుడుగా పనిచేశారు. ఈయన శబ్దలక్షణ సంగ్రహం, ఆంధ్రభాషాను శాసనం, అక్షర గుచ్ఛం, విభక్తిబోధిని, ధాతుమాల, బాలవ్యాకరణం, నీతిచంద్రిక మొదలైన గ్రంథాలను రచించారు.

సంస్కృతంలో 'పంచతంత్రం' అనే గ్రంథమాధారంగా మిత్ర లాభం, మిత్రభేదం అనే రెండు భాగాలను 'నీతి చంద్రిక ' పేరిట చిన్నయ సూరి రచించారు. ఈయన రచన మధురంగా, శైలి రమణీయంగా ఉంటుంది.

'పిల్లి-గ్రద్ద' అనే ఈ పాఠం నీతి చంద్రికలోని 'మిత్రలాభం' నుండి గ్రహింపబడింది.]



©KTBS RE-PUBLISHED

భాగీరథీ తీరమందు గొప్ప జువ్వి వృక్షము కలదు. దాని తొఱ్ఱలో జరద్గవ మను చీకు ముసలి గ్రద్ద వాసము చేయుచుండెను. ఆ వృక్షము మీద వసించు పక్షులు దాని జీవనమునకయి తాము తెచ్చుకున్న యెరలో కొంచెము పంచి పెట్టుచుండెను. ఒకనాడు దీర్ఘకర్ణమను పిల్లి పక్షి పిల్లలను భక్షించుటకై ఆగ్రమాని కడకు సద్దు చేయక వచ్చెను.

దాని రాక జూచి పక్షి పిల్లలు భయపడి కూయసాగెను. ఆ కోలాహలమును 'జరద్గవము' విని ఎవ్వరో పరులు వచ్చుచున్నారని యెంచుకొని ఎవరక్కడ ? అని హెచ్చరించెను.

అప్పుడు బిడాలము గ్రద్దను చూచి, భయపడి హా ! చచ్చితిగదా ! తప్పించుకొనుటకు ఉపాయాంతరము లేదు. కానున్నది కాక మానదు, రోటిలో తలదూర్చి రోకటి పోటునకు వెఱువదీరునా ! మంచిది. ఇప్పుడు మంచితనము చూపి దీనికి నమ్మికబుట్టజేసెద అని ఆలోచించి ఎట్టయెదుట నిలిచి యిట్లనియె. 'అయ్యా ! నమస్కారము'. అనగానే గృధ్రము విని ఎవ్వడవు నీవని అడిగెను.

'నేను బిడాలమను. నన్ను దీర్ఘకర్ణమని చెప్పుదురు'. అన విని గృధ్ర మిట్లనియె. శీఘ్రముగా దూరముపో. పోకుంటివా నీ ప్రాణములు నీవి కావు. చూడు నా దెబ్బ అనగానే బిడాలము ఇట్లనియె. ముందు నా మాట వినుము. నేను వధ్యుడనో కానో విచారింపుడు. తర్వాత మీకు తోచినట్లు చేయుడు. గుణ దోషములు విచారించి వీడు పూజ్యుడు, వీడు వధ్యుడని నిర్ణయింప వలెగాని, జాతి మాత్రము చేత నిర్ణయింప తగునా ?

నావుడు నీవు వచ్చిన పనియేమని గృధమడిగెను, పిల్లి యిట్లనియె. 'ఇక్కడ గంగలో నిత్యము స్నానము చేయుచు మాంసాశనము విడిచి బ్రహ్మచారినై చాంద్రాయణ వ్రతమును చేయుచున్నవాడను. మీరు ధర్మజ్ఞులని, మంచి వారని యిచ్చటి పక్షులు అప్పుడప్పుడు ప్రశంసింపగావిని మీ దర్శనము చేయవలయునను కోరిక కల్గినది. అది ఇన్నాళ్ళకు ఫలించినది. శత్రువునకయినను, గృహమునకు వచ్చిన వానికాతిథ్యము చేయవలసినది ధర్మము, అనగా విని గ్రద్ద యిట్లనియె. పిల్లులకు మాంసము నందు రుచి మిక్కుటము. ఇక్కడ నా పక్షి పిల్లలున్నవి. అందుచేత నే నట్లు చెప్పితిని'. అనగానే పిల్లి రెండు చెవులు మూసుకొని కృష్ణ కృష్ణాయని యిట్లనియె. ఎంత పాపము చేసి ఈ పిల్లి జన్మమెత్తితినో ? ఇది చాలక ఈ పాపము సయితము కట్టుకోవలెనా ! 'అహింసా పరమోధర్మః' అను పెద్దల మాటలను వినలేదా ! భూతదయ కలవాడే సర్వధర్మములు తెలిసి యింకను చెడుదునా ! అడవిలో స్వచ్ఛందముగా మొలచిన యే శాకముతో నైనా క్షుధ తీర్చుకొని ప్రొద్దుపుచ్చవచ్చును. ఈ పాడు పొట్టకై యింత పాపము చేయుట కెవ్వడు పాల్పడును ? ఆహా ! ఎంత మాటాడితిరి అనెను.

©KTBS NOT TO BE REPUBLISHED

అనగా గ్రద్దవిని 'కోపము సేయకు'. క్రొత్తగా రాగానే వచ్చిన వారి స్వభావ మేలాగున తెలుసు కోవచ్చును ? అప్పుడు చెప్పిన మాట తప్పుగా పట్టబోకు. పోయిన మాట పోనిమ్ము. నీవు యథేచ్ఛగా రావచ్చును. పోవచ్చును. నీకొక అడ్డంకి లేదని చెప్పెను. అనంతరము మార్జాలము జరద్గవముతో మిక్కిలి సఖ్యము కలిగి ఆ తొఱ్ఱలో వాసము చేయుచుండెను. ఇట్లు కొన్ని దినములు గడిచిన తర్వాత మార్జాలము ప్రతి దినము నడికిరేయి చప్పుడు చేయక వృక్ష మెక్కి పక్షి పిల్లలను గొంతు కొఱికి, తెచ్చి తొఱ్ఱలో పెట్టుకొని తినసాగెను. అక్కడ పక్షులు తమ పిల్లలను గానక మిక్కిలి దుఃఖించి అక్కడక్కడ వెదుకనారంభించినవి. అది ఎఱిగి పిల్లి తొఱ్ఱ వెడలి పారిపోయెను.



ఆ పక్షులు వెదుకుచు వచ్చి తొఱ్ఱలో తమ పిల్లల ఎముకలు చూచి 'యీ గ్రద్దయే మన పిల్లలను భక్షించిన' దని నిశ్చయించి దానిని గోళ్ళతో ఱక్కి చంచువులతో పొడిచి చంపెను.

కాబట్టి క్రొత్తగా వచ్చిన వారి స్వభావము తెలియక తావిచ్చిన హాని తప్పదు.

## 1. కొత్త పదాలు

అహింస; ఆతిథ్యము; ఎర: కోలాహలము; గుణదోషములు; గృధ్రము; గృహము; చంచువు; చాంద్రాయణ వ్రతం; జరద్గవము; జువ్వివృక్షము; తొఱ్ఱ; దీర్ఘ కర్ణము; ధర్మజ్ఞులు; పరమ ధర్మము; పరులు; పారిపోవు; పూజ్యుడు; ప్రశంసించు; బిడాలము; బ్రహ్మచారి; భాగీరథి; భూతదయ; భక్షించు; మార్జాలము; మిక్కుటము; యథేచ్ఛ; రోకటిపోటు; వధ్యుడు; శాకము; శీఘ్రము; క్షుధ;

## 2. అర్థాలు

భాగీరథి=గంగ; బిడాలము=పిల్లి; గృధ్రము=గ్రద్ద; తొఱ్ఱ=చెట్టులోని రంధ్రం; క్షుద=ఆకలి; అశనము=ఆహారము; చీకు=గ్రుడ్డి; మార్జాలము=పిల్లి; ఎర=ఆహారము; సఖ్యము=స్నేహము; శీఘ్రము=వెంటనే; శబ్దము=చప్పుడు; శాకములు=ఆకులు, అలములు; చంచువు=ముక్కు;

## 3. వ్యుత్పత్త్యర్థాలు

| | | |
|---|---|---|
| బిడాలము | – | ఎలుకలను చంపునది (పిల్లి) |
| పక్షి | – | పక్షములు (రెక్కలు) కలది |
| బ్రహ్మచారి | – | బ్రహ్మయందు చరించువాడు ( పెళ్ళికాని వాడు) |
| మార్జాలము | – | ఎలుకలను చంపి ఇంటిని శుభ్రపరచునది (పిల్లి) |
| భాగీరథి | – | భగీరథునిచే తేబడినది (గంగ) |

## 4. ప్రకృతి-వికృతి

| | | |
|---|---|---|
| సహవాసము | – | సావాసము |
| శబ్దము | – | సద్దు |
| గృధ్రము | – | గ్రద్ద |
| నిత్యము | – | నిచ్చలు |
| స్నానము | – | తానము |
| గృహము | – | గీము |
| పక్షి | – | పక్కి |
| స్నేహము | – | నేస్తము, నెయ్యము |
| ఆహారము | – | ఓగిరము |
| గుణము | – | గొనము |
| యజ్ఞము | – | జన్నము |
| దైవము | – | దయ్యం. |

©KTBS NOT TO BE REPUBLISHED

**5. వ్యతిరేక పదాలు:-**

| | | |
|---|---|---|
| నిజము | × | కల్ల |
| రాత్రి | × | పగలు |
| పాపము | × | పుణ్యము |
| సంతోషము | × | దుఃఖము |
| శత్రువు | × | మిత్రుడు |
| న్యాయము | × | అన్యాయము |

**6. సంధులు:-**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఎవరక్కడ | = | ఎవరు | + | అక్కడ | ( ఉకార సంధి) |
| నీవెక్కడ | = | నీవు | + | ఎక్కడ | (ఉకార సంధి) |
| చెట్టెక్కెను | = | చెట్టు | + | ఎక్కెను | (ఉకార సంధి) |
| ఎక్కడున్నాడు | = | ఎక్కడ | + | ఉన్నాడు | (అకార సంధి) |
| మాంసాహారము | = | మాంస | + | ఆహారము | (సవర్ణ దీర్ఘ సంధి) |

**7. వివరణలు:** 1. చాంద్రాయణ వ్రతం:– చంద్రుడి కళ పౌర్ణమికి, అమావాస్యకు పెరగడం, తగ్గడం జరుగుతుంది. ఆ విధంగానే భోజనాన్ని కూడా పెంచుతూ, తగ్గిస్తూ తింటూ చేసే వ్రతాన్ని 'చాంద్రాయణ వ్రతం' అంటారు.

2. అహింసా పరమోధర్మః :– అహింసను మించిన ధర్మము మరొకటి లేదు.

**8. కింది ప్రశ్నలకు ఒకటి (లేదా) రెండు వాక్యాల్లో జవాబులు రాయండి:**

1) ముసలి గ్రద్ద ఎక్కడ నివసిస్తుండేది ?

2) పక్షి పిల్లలు ఎందుకు అరిచాయి ?

3) పిల్లి గ్రద్దను ఏ విధంగా నమ్మించింది ?

4) చెట్టుపై ఉన్న పక్షి పిల్లలను పిల్లి ఏ విధంగా చంపింది ?

5) పిల్లి నిత్యము ఎక్కడ స్నానం చేస్తున్నానని చెప్పింది ?

6) గ్రద్దను పక్షులు ఏ విధంగా చంపాయి ?

**9. కింది ప్రశ్నలకు వివరంగా జవాబులు రాయండి:-**

1) పక్షులు గ్రద్దను చంపడానికి కారణం ఏమిటి ?

2) ' పిల్లి–గ్రద్ద' కథను రాసి నీతిని తెలపండి ?

© KTBS NOT TO BE REPUBLISHED

# అనుబంధం
# తెలుగు వ్యాకరణం

## సంధి:

పూర్వపరస్వరాలకు పరస్వరం ఏకాదేశం కావడం సంధి.

ఉదా: రాముడు + ఇతడు= రాముడితడు

ఇక్కడ 'రాముడు' అనే పదం చివరి అక్షరంలో 'ఉ' అనే స్వరంవుంది. ఇది పూర్వ స్వరం. పరంగా ఉన్న 'ఇ' పరస్వరం. రెంటికీ కలిపి పరస్వరమైన 'ఇ' రావటం సంధి. ఏకాదేశం అంటే రెండు వర్ణాలకు బదులుగా ఒకే వర్ణం రావడం.

## తెలుగు సంధులు:

### 1. అకారసంధి:

సూత్రం: అత్తునకు సంధి బహుళముగానగు. అత్తు అంటే హ్రస్వమైన అకారం. దీనికి అచ్చుపరమైనపుడు సంధి బహుళంగా అవుతుంది. సంధిలో నిత్య, నిషేధ, వైకల్పిక, అన్యకార్య ప్రవృత్తులుండటాన్ని బహుళం అంటారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | రామ | + | అయ్య | = | రామయ్య (నిత్యం) |
| | అమ్మ | + | ఇచ్చెను | = | అమ్మయిచ్చెను (నిషేధం) |
| | మేన | + | అల్లుడు | = | మేనల్లుడు; మేనయల్లుడు (వైకల్పికం) |
| | ఒక | + | ఒక | = | ఒకానొక (అన్యకార్య ప్రవృత్తి) |

### 2. ఇకారసంధి:

సూత్రం: ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగానగు. 'ఇత్తు' అంటే హ్రస్వ 'ఇ' కారం. ఏమ్యాదులు అంటే ఏమి, మఱి, అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి మొదలైనవి. హ్రస్వ ఇకారానికి అచ్చు పరమైతే సంధి వచ్చినరూపం ఒకటి, రాని రూపం ఒకటి వుంటుంది. దాన్ని వైకల్పికం అంటారు.

ఉదా: ఏమి + అంటివి = ఏమంటివి (సంధి)

ఏమియంటివి (సంధిలేదు)

మఱి + ఏమి = మఱేమి (సంధి)

మఱియేమి (సంధిలేదు)

© KTBS NOT TO BE REPUBLISHED

**౩. ఉకారసంధి:**

సూత్రం: ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు.

ఉత్తు అంటే హ్రస్వ ఉకారం. పూర్వపదం చివరవున్న హ్రస్వమైన ఉకారానికి అచ్చుపరమైతే సంధి జరుగుతుంది.

ఉదా: రాముడు + అతడు = రాముడతడు

సోముడు + ఇతడు = సోమడితడు

మనము + ఉంటిమి = మనముంటిమి

అతడు + ఎక్కడ = అతడెక్కడ

ఇతడు + ఒకడు = ఇతడొకడు

**౩. ద్విరుక్తటకారదేశసంధి:**

సూత్రం: 1. కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దంబుల డడల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు. కుఱు, చిఱు, కడు, నడు, నిడు మొదలైన శబ్దాలలోని ఱ, డలకు పరంగా అచ్చువుంటే ఆ ఱ, డలు 'ట్ట'గా మారుతాయి. అంటే ద్విత్వ టకారం వస్తుంది.

ఉదా: కుఱు + ఉసురు = కుట్టుసురు

చిఱు + ఎలుక = చిట్టెలుక

కడు + ఎదురు = కట్టెదురు

నడు + ఇల్లు = నట్టిల్లు

నిడు + ఊరుపు = నిట్టూరుపు

2. ఆమ్రేడితము పరమగుపుడు కడాదుల తొలియచ్చు మీది వర్ణంబులకెల్ల అదంతంబగు ద్విరుక్తటకారాదేశమగు

కడ, చివర మొదలైన పదాలు రెండుసార్లు వరుసగా వస్తే మొదటి పదంలోని మొదటి అచ్చు తర్వాత వున్న వర్ణాలన్నీ పోయి దాని స్థానంలో 'ట్ట' అనేవర్ణం వస్తుంది.

ఉదా: కడ + కడ = కట్టకడ

చివర + చివర = చిట్టచివర

తుద + తుద = తుట్టతుద

పగలు + పగలు = పట్టపగలు

NOT TO BE REPUBLISHED @KTBS

### 4. త్రికసంధి:

సూత్రం: ఆ. ఈ, ఏలు త్రికములు. త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళముగానగు. ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.

ఆ, ఈ, ఏ అనే అక్షరాలను త్రికములంటారు. సమాసాలలో ఆ, ఈ, ఏలకు అసంయుక్త హల్లు పరమైతే ఆ హల్లుకు ద్విత్వం బహుళంగా వస్తుంది. ఆ విధమైన ద్విత్వంతో కూడిన హల్లుపరమైతే మొదటి దీర్ఘాక్షరం హ్రస్వాక్షర మవుతుంది.

ఉదా: ఆ + చోటు = అచ్చోటు

ఇక్కడ 'చో' అనేది అసంయుక్త హల్లు. దానికి ద్విత్వం వస్తే 'చ్చో' అవుతుంది. దానికి ముందున్న దీర్ఘం హ్రస్వంగా మారుతుంది. అంటే 'ఆ' అనే దీర్ఘాక్షరం 'అ' అయింది.

ఆ + చోటు = ఆ + చ్చోటు = అచ్చోటు

### 5. ఆమ్రేడిత సంధి:

సూత్రం: అచ్చునకు ఆమ్రేడితము పరంబగునపుడు సంధి తఱచుగనగు. ఒకే పదాన్ని రెండు సార్లు వరుసగా పలికితే రెండోపదాన్ని ఆమ్రేడితం అంటారు. అచ్చునకు ఆమ్రేడితం పరమైతే సంధి జరిగి, మొదటి పదం చివరి అచ్చు పోయి, రెండవ పదం మొదటి అచ్చుతో సంధి జరుగుతుంది.

ఉదా: ఆహా + ఆహా = ఆహాహా

ఏమీ + ఏమీ = ఏమేమీ

ఔర + ఔర = ఔరౌర

## సంస్కృత సంధులు:

### 1. సవర్ణదీర్ఘసంధి:

సూత్రం: అ, ఇ, ఉ, ఋ లకు సవర్ణములు పరమైనచో దీర్ఘమేకాదేశమగును

సవర్ణాలు అంటే సమానమైన వర్ణాలు. 'అ' వర్ణానికి 'అ', 'ఆ'లు సవర్ణాలు. అలాగే తక్కినవి. ఇలాగే సవర్ణాలు పరమైనపుడు దీర్ఘం ఏకాదేశంగా వస్తుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | దేవ | + | ఆలయం | = | దేవాలయం |
| | కపి | + | ఇంద్రుడు | = | కపీంద్రుడు |
| | మధు | + | ఉదయం | = | మధూదయం |
| | పితృ | + | ఋణం | = | పితౄణం |

© KTBS NOT TO BE REPUBLISHED

**2. యణాదేశసంధి**:

సూత్రం: ఇ, ఉ, ఋ, ఌ లకు అసవర్ణాచ్చులు పరమైనపుడు క్రమంగా య, వ, ర, ల వచ్చును. య, వ, ర, ల లను యణ్ణులు అంటారు. అసవర్ణాచ్చులు అంటే సమానం కాని అచ్చులు, అవి పరంగా వుంటే ఈ విధంగా సంధి జరుగుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| ఇ | + | అ | = | య |
| ఉ | + | అ | = | వ |
| ఋ | + | అ | = | ర |
| ఌ | + | అ | = | ల |
| ప్రతి | + | అక్ష | = | ప్రత్యక్ష |
| అణు | + | అస్త్రం | = | అణ్వస్త్రం |
| పితృ | + | అర్థం | = | పిత్రర్థం |
| ఌ | + | ఆకృతి | = | లాకృతి |

**సమాసాలు**:

సమాసం: సమర్థంబులగు పదంబు లేక పదంబగుట సమాసంబు.

అర్థవంతాలైన విడి పదాలను ఒక పదంగా కూర్చడం సమాసం.

విగ్రహం: సమాసం చేసినపుడు పదాల మధ్యలోపించిన విభక్తి ప్రత్యయాలను చేర్చి చెప్పడాన్ని విగ్రహం అంటారు.

పూర్వపదం: సమాసంలోని మొదటి పదాన్ని పూర్వపదం అంటారు.

ఉత్తరపదం: సమాసంలోని రెండవ పదాన్ని ఉత్తరపదమంటారు.

రామ బాణం (సమాసం)

రాముని యొక్క బాణం (విగ్రహవాక్యం)

రామ (పూర్వపదం)

బాణం (ఉత్తరపదం)

**1. ద్వంద్వ సమాసం**:

ఉభయపదార్థ ప్రధానం ద్వంద్వం. ఇందులో సమాసంలోని రెండు పదాలకూ సమాన ప్రాధాన్యం ఉంటుంది. ఇది తరచుగా బహువచనాంతమై ఉంటుంది. ఇందులోని పదాలన్నీ నామవాచకాలై ఉంటాయి.

©KTBS NOT TO BE REPUBLISHED

ఉదా: రామకృష్ణులు – రాముడును, కృష్ణుడును

జననీజనకులు – జననియు, జనకుడును

సూర్యచంద్రులు – సూర్యుడును, చంద్రుడును

సమాసంలో రెండుకంటే ఎక్కువ పదాలు ఉండి, అన్ని పదాల యొక్క అర్థం ప్రధానమయితే బహుపద ద్వంద్వం అనబడుతుంది.

ఉదా: రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు. రాముడును, లక్ష్మణడును, భరతుడును, శత్రుఘ్నుడును

నటవిటగాయకులు – నటులు, విటులు, గాయకులు

అవ్యయ భేదం లేని పదసమూహం ఉన్న దానిని సమాహార ద్వంద్వం అంటారు. ఇందులో సమూహ అర్థమే ముఖ్యం.

ఉదా: గోవ్యాఘ్రం – గోవ్యాఘ్రాల సమూహం

కూడుగుడ్డ – కూడుగుడ్డల సమూహం

@KTBS NOT TO BE REPUBLISHED

### ౨. ద్విగు సమాసం:

సంఖ్యాపూర్వకమైన కర్మధారయాన్నే ద్విగువంటారు. గుణాది విశేషణాలుకాక సంఖ్యావిశేషణం పూర్వం ఉంటే ద్విగుసమాసం.

ఉదా: ముజ్జగములు – మూడుజగములు

ముల్లోకములు – మూడులోకములు

పదిదిక్కులు – పదిదిక్కులు

### ౩. కర్మధారయ సమాసం:

విశేషణమునకు విశేష్యము తోడ సమాసం సమానాధికరణం. దీన్నే కర్మధారయ సమాసం అంటారు. ఇది ఉత్తర పద ప్రాధాన్యం కలది.

ఉదా: సరసపువచనం – సరసమైనవచనం

మంచిరాజు – మంచివాడైనరాజు

ఇవి ముఖ్యంగా ఏడు విధాలుగా ఉంటాయి.

1. విశేణ పూర్వపద కర్మధారయం : విశేషణం పూర్వపదంగా ఉన్నది.

ఉదా: నల్లబల్ల – నల్లనైనబల్ల

రమ్యలత – రమ్యమైనలత

2. విశేషణోత్తరపద కర్మధారయం : విశేషణం ఉత్తరపదంగా ఉన్నది.

ఉదా: కపోతవృద్ధం –వృద్ధమైన కపోతం

రాజోత్తముడు – ఉత్తముడైనరాజు

3. విశేషణోభయపదకర్మధాయం: పూర్వోత్తర పదాలు రెండూ విశేషణాలుగా ఉన్నది.

ఉదా: మృదుమధురం – మృదువైనది, మధురమైనది

ధీరోదాత్తుడు – ధీరుడును, ఉదాత్తుడును.

4. ఉపమాన పూర్వపద కర్మధారయం: ఉపమానం పూర్వపదంగా, ఉపమేయం ఉత్తరపదంగా ఉన్నది.

ఉదా: తేనెపలుకులు – తేనెవంటి పలుకులు

చిగురుమోవి – చిగురువంటి మోవి

5. ఉపమానోత్తరపద కర్మధారయం: ఉపమానం ఉత్తరపదంగా, ఉపమేయం పూర్వపదంగా ఉన్నది.

ఉదా: ముఖపద్మం – పద్మంవంటిముఖం

నాభికమలం – కమలంవంటి నాభి

6. సంభావన పూర్వపద కర్మధారయం: సంభావన పూర్వమందు ఉన్నది. సంభావన అంటే సంజ్ఞ లేక పేరు. అంటే సంజ్ఞావాచకం పూర్వపదంగా ఉన్నది.

ఉదా: గంగానది – గంగ అనే పేరుకల నది

వింధ్యపర్వతం – వింధ్య అనే పేరు కల పర్వతం.

7. అవధారణా పూర్వపద కర్మధారయం లేక రూపక సమాసం : ఒక దాని ధర్మం మరొక దానిలో ఆరోపింపబడేది అవధారణ. అవధరణ పూర్వపదంగా కలది అవధరణా పూర్వపద కర్మధాయం.

ఉదా: విద్యాధనం – విద్య అనెడి ధనం

అజ్ఞానాంధకారం – అజ్ఞానమనెడి అంధకారం

@KTBS NOT TO BE REPUBLISHED

# ఛందస్సు

పద్యలక్షణాలను తెలిపే శాస్త్రం ఛందస్సు. ఇవి గణ బద్ధాలు. గురులఘువులతో కూడి గణాలు ఏర్పడుతాయి. పద్యాలు వృత్తాలు, జాతులు, ఉపజాతులు అని మూడురకాలు.

గురువులు: రెండుమాత్రల (రెండుకనురెప్పపాట్ల) కాలంలో పలుకబడే అక్షరాలు. అవి

1. దీర్ఘాచ్చులు:

   ఉదా: ఆ, ఈ, ఏ, ఓ మొదలైనవి

2. ఐ, ఔ, లు నిత్యగురువులు

   ఉదా: ఏకైక, ఔపోశనం మొదలైనవి

3. దీర్ఘాచ్చులతో కూడిన హల్లులు

   ఉదా: పీ, వే, కో మొదలైనవి

4. సున్న, విసర్గ, పొల్లు హల్లులతో కూడిన అక్షరాలు

   ఉదా: అం; అః; చేసెన్ మొదలైనవి

5. సంయుక్త ద్విత్వ అక్షరాలకు ముందున్న అక్షరాలు

   ఉదా: పట్టు; కొమ్మ; ఆశ్చర్యం

**గురువుకు గుర్తు**: 'U'

లఘువులు: ఒక మాత్ర (ఒక కనురెప్పపాటు) కాలంలో పలకబడే అక్షరాలు

అవి 1. అన్ని హ్రస్వాచ్చులు: అ, ఇ, ఎ, ఒ మొదలైనవి

2. హ్రస్వాచ్చులతో కూడిన హల్లులు క, కి, కు, కృ మొదలైనవి

వి సూ: వత్రుసుడికి ముందున్న అక్షరాలు లఘువులే. ఎందుకంటే వత్రుసుడి 'ృ' ('ఋ' అనే అక్షరపుగుర్తు) అచ్చు.

ఉదా: వికృతి

**లఘువుకు గుర్తు**: 'I'

రెండక్షరాల గణాలు: 1. హగణం లేక గలం 'UI' ముందుగురువు తరువాత లఘువు ఉన్నది

ఉదా: ఏమి
U I

2. గగం: రెండు అక్షరాలు గురువులే అయి ఉండేది. UU
ఉదా: బాబా / రాజా

UU UU

NOT TO BE REPUBLISHED @KTBS

3. వగణం లేక లగం: మొదటిది లఘువు, తరువాతిది గురువు I U

ఉదా: రమా
I U

**మూడక్షరాల గణాలు:**

| | |
|---|---|
| భగణం | UII |
| జగణం | IUI |
| సగణం | IIU |
| యగణం | IUU |
| రగణం | UIU |
| తగణం | UUI |
| మగణం | UUU |
| నగణం | III |

యతి: పద్యపాదంలోని మొదటి అక్షరం

ప్రాస: పద్యపాదంలోని రెండవ అక్షరం

ప్రాసనియమం : ప్రాసాక్షరానికి ముందు లఘువుంటే లఘువు, గురువుంటే గురువు, అన్ని పాదాలలో ప్రాసాక్షరానికి ముందురావాలి. ప్రాసాక్షరంగా ఏ అక్షరం ఉంటుందో, అదే అక్షరం కాని, లేక ఆ అక్షర గుణింతంకాని మిగిలిన పాదాలలో ప్రాసాక్షరంగా ఉండాలి. ద్విత్వ/సంయుక్తాక్షరాలుంటే వాటిలో ఏ ఒక్క అక్షరాన్నైనా గ్రహించవచ్చు.

ప్రాసయతి : పద్యపాదంలోని మొదటి అక్షరమైన యతికి బదులుగా రెండవ అక్షరమైన ప్రాసకు యతి స్థానానికి తరువాత ఉండే అక్షరానికి ప్రాసమైత్రి కల్పించటాన్ని ప్రాసమైత్రి అంటారు.

ఉదా: చూడ చూడ రుచుల జాడవేరు

చూడ–జాడ లకు ప్రాసయతి.

**వృత్తాలు:**

మొదటి పాదంలో చెప్పిన లక్షణమే ఆవృత్తమై మిగిలిన పాదాలలోవస్తే దాన్ని 'వృత్తం' అంటారు. వాటిలో

NOT TO BE REPUBLISHED ©KTBS

**1. ఉత్పలమాల:**

1. ఈ వృత్తంలో నాలుగు పాదాలు ఉంటాయి.
2. ప్రతిపాదంలోనూ వరుసగా భ, ర, న, భ, భ, ర, వ అనేగణాలు ఉంటాయి
3. 1-10 అక్షరాలకు మైత్రి చెల్లుతుంది
4. ప్రాసనియమం ఉంది
5. ప్రాసయతి చెల్లదు.

ఉదా: ఎవ్వని | చేజనిం | చుజగ | మెవ్వని | లోపల |నుండులీ | నమై

| UII | UIU | III | UII | UII | UIU | IU |
|---|---|---|---|---|---|---|
| భ | ర | న | భ | భ | ర | వ |

ఇందులో మొదటి అక్షరం 'ఎ' 10వ అక్షరమైన 'ఎ'కు యతిమైత్రి చెల్లింది.

**2. చంపకమాల:**

1. ఈ వృత్తంలో నాలుగు పాదాలు ఉంటాయి.
2. ప్రతి పాదంలోనూ వరుసగా న, జ, భ, జ, జ, జ, ర అనే గణాలుంటాయి
3. 1-11 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది
4. ప్రాసనియమం ఉంది.
5. ప్రాసయతి చెల్లదు.

| III | IUI | UII | IUI | IUI | IUI | UIU |
|---|---|---|---|---|---|---|

ఉదా: కనుగొ |నికోప | వేగము | నకన్ను | లనిప్పు | లురాల | యంగముల్

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| III | IUI | III | III | III | III | III |

ఇందులో మొదటి అక్షరం క, 11వ అక్షరమైన 'క'కు యతిమైత్రి చెల్లింది

**3. శార్దూలం:**

1. ఈ వృత్తంలో నాలుగు పాదాలు ఉంటాయి
2. ప్రతి పాదంలోనూ వరుసగా మ, స, జ, స, త, త, గ అనే గణాలు ఉంటాయి.
3. 1-13 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది.

©KTBS NOT TO BE REPUBLISHED

4. ప్రాసనియమం ఉంది

5. ప్రాసయతి చెల్లదు.

ఉదా కారేరా | జులరా | జ్యముల | కలుగ | వేగర్వో | న్నతింబొం | దరే

| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |

ఇందులో మొదటి అక్షరమైన 'క' కు, 13వ అక్షరమైన 'గ'కు యతిమైత్రి చెల్లింది.

## 4. మత్తేభం:

1. ఈ పద్యంలో నాలుగు పాదాలు ఉంటాయి

2. ఈ పద్యంలో వరుసగా స, భ, ర, న, మ, య, వ అనే గణాలు ఉంటాయి.

3. 1-14 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది.

4. ప్రాస నియమం ఉంది

5. ప్రాసయతి చెల్లదు.

ఉదా: భువనా ధీశ్వర కావవే భువన ముల్ పూర్ణ ప్రసాదం బునన్

| IIU | UII | UIU | III | UUU | IUU | IU |
|---|---|---|---|---|---|---|
| స | భ | ర | న | మ | య | వ |

ఇందులో మొదటి అక్షరమైన 'భు' అక్షరానికి 14వ అక్షరమైన 'పూ' అక్షరానికి యతిమైత్రి చెల్లింది.

+++

@KTBS NOT TO BE REPUBLISHED

# NOTE

@KTBS
NOT TO BE REPUBLISHED

# NOTE

@KTBS
NOT TO BE REPUBLISHED